నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 30-11-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:91 పేజీలు:6 వెల: రూ.1/-

నేటి కందం- నేటికి అందం

క్రూరములగు ఘోరములగు
నేరములకు పాలుపడిన నేరస్తులకున్
భారమగు మరణ శిక్షను
తీరుగ తొలగించ గోరు దినమును దలతున్

(నవంబరు 30 మరణశిక్ష ను తొలగించగోరే దినం)

-రాధశ్రీ
సెల్:9494481210

చురక

ఏడాది తెలంగాణ
ఎట్ల పాలనున్నది
తేల్చేది ప్రజలే కదా
దేనికి పార్టీల సోది
ప్రభుత్వం విజయాల
ప్రచారాల పండుగ
విపక్షాలు వైఫల్యాల
విచారాల ఎండుగ



-వేల్పుల నారాయణ
9440433475

అత్యంత నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లలో తొలి ప్రాధాన్యం : సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 29:ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అత్యంత నిరుపేదలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. దివ్యాంగులు, వ్యవసాయ కూలీలు, సాగుభూమిలేని వారు, పారిశుద్ధ్య కార్మికులు.. ఇలా ప్రాధాన్యక్రమం ఎంచుకోవాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లపై తన నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. తొలి దశలో సొంత స్థలాలున్న వారికే ప్రాధాన్యమిస్తున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ విషయంలో గ్రామ కార్యదర్శితో పాటు మండల స్థాయి అధికారులను బాధ్యులను చేయడంతో పాటు అవసరమైన సాంకేతిక సహకారం వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఇందిరమ్మ ఇళ్ల మొబైల్ యాప్‌లో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఏ దశలోనూ లబ్ధిదారులకు ఇబ్బంది కలగవద్దని.. అదే సమయంలో శాఖాపరంగా ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా చూడాలని సూచించారు. ఆదివాసీ ప్రాంతాలు, ఐటీడీఏల పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ప్రత్యేక కోటా ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు అదనంగా గదులు నిర్మించుకునేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపితే అందుకు అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం సమర్థవంతంగా కొనసాగించేందుకు వీలుగా గృహ నిర్మాణ శాఖ బలోపేతం కావాలని, ఇందుకు అవసరమైన అధికారులు, సిబ్బందిని నియమించుకోవాలని శాఖ ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.

లగచర్ల పార్మా విలేజ్ పై ప్రభుత్వం యు టర్న్.. భూ సేకరణ రద్దు చేస్తూ ప్రకటన

హైదరాబాద్, నవంబర్ 29: ముఖ్యమంత్రి రేవంత్ స్వంత నియోజకవర్గంలో భాగంగా ఉన్న లగచర్లలో ఫార్మా విలేజ్ ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉప సంహరించుకుంది.. ఈ మేరకు ఇప్పటికే విడుదల చేసిన భూ సేకరణ నోటిఫికేషన్ ను నేడు రద్దు చేస్తూ ఒక ప్రకటన విడుదల చేసింది.. ఈ ప్రాంతంలో పారిశ్రామిక కారిడార్ ను ఏర్పాటు చేస్తామని వెల్లడించింది. దీనిపై మరిన్ని వివరాలు త్వరలోనే తెలియజేస్తామని పేర్కొంది.

కాగా, లగచర్లలో ఫార్మా విలేజ్ ను ఏర్పాటు ను నిరసిస్తూ ఇక్కడి ప్రజలు ఆందోళన బాట పట్టారు.. ఈ సందర్భంగా అధికారులపై దాడులు కూడా చేశారు.. ఈ ఘటనలో సుమారు 30 మంది వరకు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం వారంతా జైలులోనే ఉన్నారు.. దీనిపై బిఆర్ ఎస్ కూడా తీవ్ర నిరసన తెలిపింది.. అక్కడి ప్రజల మనోభావాలకు అనుగుణంగా ఫార్మా విలేజ్ ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేసింది.. ఈ నేపథ్యంలో ప్రజల నుంచి వచ్చిన నిరసన దృష్టిలో ఉంచుకుని ఫార్మా విలేజ్ ఏర్పాటు నిర్ణయాన్ని ఉప సంహరించుకుంది..

గురుకులాల్లో పాయిజన్ కుట్ర ప్రవీణ్ కుమార్ దే - మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్, నవంబర్ 29: గురుకులాల్లో ఫుడ్ పాయిజినింగ్ ఘటనల వెనుక కుట్రల వెనుక ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హస్తం ఉందని మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. గతంలో ఆయన గురుకులాల కార్యదర్శిగా పని చేశారని గుర్తు చేశారు. తన అనుచరులనే సిబ్బందిగా నియమించుకున్నట్లు చెప్పారు. తన అనుచరులతోనే ఇటువంటి ఘటనలకు పాల్పడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్ లో ఆవె నేడు మీడియాతో మాట్లాడుతూ, సంక్షేమ హాస్టళ్లను గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో హాస్టళ్లలో భోజనంలో పురుగులు వచ్చేవన్నారు. సంక్షేమ హాస్టళ్లలో సదుపాయాలు కొరవడినా బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు.

తమ ప్రభుత్వం వచ్చాక హాస్టల్లో ఓ విద్యార్థిని చనిపోయిందన్నారు. బాధిత విద్యార్థినికి ప్రత్యేక వైద్య సదుపాయం అందించామన్నారు. దురదృష్టవశాత్తూ చనిపోయిందన్నారు. ఆమె మృతిపై రాజకీయం చేయవద్దని కోరారు. హాస్టళ్లలోని విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దే బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు.

కేటీఆర్ పదేపదే జైలుకు పోతా అంటున్నారు

కేటీఆర్ ఏదో తప్పు చేసినట్లున్నారని, అందుకే జైలుకు పోతానని పదేపదే అంటున్నారని మంత్రి కొండా అన్నారు. గిరిజనుల కోసం, . మూసీ నది కోసం జైలుకు పోతానని కెటిఆర్ అంటున్నారని, అయితే తాను చేసిన తప్పులకు జైలుకు పోతానని కేటీఆర్‌కు తెలుసి ప్రజల కోసం జైలుకు పోతానని అందర్ని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో తాను కూడా ఎమ్మెల్యేగా ఉన్నానని, కానీ కేసీఆర్ , కేటీఆర్ ఎప్పుడైనా ఎమ్మెల్యేలను కలిసి సమస్యలు విన్నారా అని ప్రశ్నించారు. కనీసం వారు మంత్రులకు కూడా దొరకలేదని విమర్శించారు. కానీ ఈరోజు నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. ప్రజలు ఐదేళ్లు పాలించాలని అధికారం ఇస్తే ప్రభుత్వాన్ని దింపుతానని సైకోరావు అనడం విడ్డూరమని కేటీఆర్‌ను ఉద్దేశించి అన్నారు.

కేసీఆర్ పోరాటం వల్లే తెలంగాణ.. కేటీఆర్

-పదేళ్లపాటు బంగారు పాలన
-420 హామీలతో అధికారంలోకి కాంగ్రెస్..
-మరోసారి కదం తొక్కుదాం..
-ప్రజల పక్షాన పోరాడుదాం..
-బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కరీంనగర్, నవంబర్ 29 : కేసీఆర్ పోరాటాల వల్లే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిందని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తెలియజేశారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా అల్గునూరులో దీక్షా దివస్ సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ? కేసీఆర్ ఆమరణ దీక్ష చేపట్టి శవయాత్రనా.. జైత్రయాత్రనా.. అంటూ ఉద్యమాన్ని ఉవ్వెత్తున సాగించడం వల్లే కేంద్రం దిగి వచ్చి ఆనాడు తెలంగాణ ఇచ్చిందన్నారు. 1948 నుంచి 1956 వరకు హైదరాబాద్ పేరిట ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఉండేదని, అప్పటి ప్రధాని నెహ్రూ 1956లో రాష్ట్రాన్ని విడగొట్టి తెలంగాణకు తీరని అన్యాయం చేశారన్నారు. కాంగ్రెస్ తప్పిదం వల్ల 1968 వరకు అణువణువునా తెలంగాణ అన్యాయానికి గురైందన్నారు. 1968 నుంచి 1971 వరకు తొలిదశ పోరాటం ఉధృతంగా నడిచిందని, 370 మంది అమరులైన అనంతరం 1971లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ ప్రజా సమితికి ప్రజలు 11 ఎంపీ సీట్లను కట్టబెట్టారన్నారు.

ఎన్నికైన ఎంపీలను కాంగ్రెస్ ప్రలోభాలకు గురి చేసి ఉద్యమాన్ని నీరుగార్చిందన్నారు. 1971 నుంచి 2001 వరకు ప్రొఫెసర్ జయశంకర్, విద్యాసాగర్‌రావుతో పాటు కవులు, కళాకారులు, విద్యావంతులు తెలంగాణ కోసం పోరాడుతూనే ఉన్నారన్నారు. 2001లో ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ టీఆర్ఎస్‌ను స్థాపించి మలిదశ ఉద్యమాన్ని ప్రారంభించారన్నారు. టీఆర్ఎస్ ప్రారంభమైన నాడు కేసీఆర్‌కు మనీ పవర్, మజిల్ పవర్, మీడియా పవర్‌లాంటివి ఏమీ తోడు లేవని, కరీంనగర్‌లో సింహగర్జన ద్వారా ఉద్యమానికి శ్రీకారం చుట్టారన్నారు. 2009 డిసెంబర్ 29న కేసీఆర్ ఆమరణ దీక్ష చేపట్టి ఉద్యమానికి ఊపుతెచ్చేందుకు ప్రయత్నించడంతో అల్గునూర్ చౌరస్తా వద్ద పోలీసులు అదుపులోకి తీసుకొని ఖమ్మం ఆస్పత్రికి తరలించారన్నారు. శ్రీకాంతాచారి ప్రాణత్యాగం చేశారని, పోలీస్ కిష్టయ్య బలిదానం చేసుకోవడంతో కేసీఆర్ చలించి పోయారన్నారు.

11 రోజులపాటు కేసీఆర్ ఆమరణ దీక్ష చేపడితే పరిస్థితి అదుపు తప్పుతోందని గ్రహించిన అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో కేసీఆర్ దీక్ష విరమించారన్నారు. అయినప్పటికి ఐదేళ్లపాటు కాంగ్రెస్ మోసం చేయడంతో 1200మంది విద్యార్థులు, యువకులు ప్రాణత్యాగం చేశారన్నారు. 14 ఏళ్ల సుదీర్ఘ పోరాటం అనంతరం కేంద్రం దిగి వచ్చి తప్పని పరిస్థితుల్లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేసిందన్నారు. తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేసీఆర్ పదేళ్లపాటు బంగారు పాలన అందించారన్నారు. రైతాంగానికి రైతుబంధు, పింఛన్ల పెంపులాంటి ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు.

2023లో కాంగ్రెస్ పార్టీ 420 దొంగ హామీలు ఇచ్చి దొడ్డిదారిన అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడుస్తున్నా హామీల అమలుకు మాత్రం పూనుకోవడం లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పోరాడుతున్న బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెట్టి జైలుకు పంపుతుందన్నారు. ఆటో వాలా నుంచి రైతులు, మహిళలతో పాటు రాష్ట్రంలోని ఏ వర్గం ప్రభుత్వ తీరు పట్ల సంతృప్తితో లేదన్నారు. గురుకుల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందక ప్రాణాలు కోల్పోతున్నారన్నారు.

ఉద్యమకారులపై తుపాకీ గురి పెట్టిన రేవంత్ రెడ్డి ఇప్పుడు కేసీఆర్‌పై అవాకులు చెవాకులు పేలుతున్నాడని, ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధమయ్యారన్నారు. ఏడాది గడవక ముందే ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. నాలుగేళ్లపాటు ప్రజల పక్షాన పోరాటం చేసేందుకు బీఆర్ఎస్ సిద్ధంగా ఉందన్నారు.

గౌతమ్ అదానీ అంశంపై దద్దరిల్లిన పార్లమెంట్

-వెనక్కి తగ్గేదే లే అన్నట్లుగా విపక్ష.. సభ సోమవారానికి వాయిదా

న్యూ ఢిల్లీ నవంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ప్రముఖ వ్యాపారవేత్త గౌతమ్ అదానీ అంశంపై పార్లమెంట్ దద్దరిల్లుతోంది. దీంతో శుక్రవారం ఉదయం ఉభయ సభల సమావేశాలు ప్రారంభమైన కొద్దిసేటికే వాయిదా పడ్డాయి.

అమెరికాలో అవినీతి కేసు అభియోగాల నేపథ్యంలో సభలో అదానీ వ్యవహారంపై చర్చించాలని కాంగ్రెస్ తో సహా ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. ఈ విషయంలో వెనక్కి తగ్గేదే లే అన్నట్లుగా విపక్ష ఎంపీల నినాదాలతో పార్లమెంట్ ఉభయ సభలు అట్టుడుకుతున్నాయి. ప్రతిపక్షాల ఆందోళనలతో సభల్లో గందరగోళం నెలకొంది. నిరసన, ఆందోళనల నడుమే కొద్దిసేపు సాగిన అనంతరం లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. ఇక, రాజ్య సభలోనూ ఇదే పరిస్థితులు ఉండటంతో సోమవారానికి వాయిదా వేశారు.

ద్వైపాక్షిక సంబంధాలపై టర్కీ ఆసక్తి : మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, నవంబర్ 29:తెలంగాణ (భారత్)తో ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరుచుకునేందుకు తాము ఆసక్తిగా ఉన్నామని టర్కీ రాయబారి ఫిరత్ సునెల్ తెలిపారు. శుక్రవారం ఆయన సచివాలయంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారిద్దరూ అరగంట పాటు పరస్పర సహకారంపై చర్చించుకున్నారు.

శ్రీధర్ బాబు మాట్లాడుతూ టర్కీ-తెలంగాణ మధ్య చారిత్రక, సాంస్కృతిక సంబంధాలు చాలా కాలంగా కొనసాగుతున్నాయన్నారు. రాష్ట్రంలో వ్యవసాయం, ఫార్మా, లైఫ్ సైన్సెస్, వాణిజ్య రంగాల్లో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఆయన తెలిపారు.

టర్కీ పారిశ్రామిక ప్రతినిధుల బృందాన్ని పంపితే వారు ఇక్కడి ఎకోసిస్టమ్ ను పరిశీలించే అవకాశం ఉంటుందన్న అభ్యర్థనకు రాయబారి ఫిరట్ సునెల్ సముఖత వ్యక్తం చేసారు. ఈ సమావేశంలో టర్కీ కాన్సుల్ జనరల్ ఒర్హాన్ యమన్ ఓకాన్ కూడా పాల్గొన్నారు.

మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం

-బైకును తప్పించబోయి అదుపుతప్పిన బస్సు బోల్తా11 మంది మృతి

ముంబై నవంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్);మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బైకును తప్పించబోయి అదుపుతప్పిన బస్సు బోల్తా పడింది.

ఈ ప్రమాదంలో 11 మంది మృతిచెందారు.

పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. గోండియా జిల్లాలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

భండారి నుంచి గోండియా వెళుతున్న బస్సుకు కోహ్మారా హైవేపై ఓ బైక్ ఎదురొచ్చింది. ఆ బైకును తప్పించే క్రమంలో డ్రైవర్ దాన్ని మరోవైపునకు తిప్పాడు.ఒక్కసారిగా బస్సును మలుపుతిప్పడంతో బోల్తా పడిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. బోస్సు బోల్తా పడిన తర్వాత డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. డ్రైవర్ కోసం గాలిస్తున్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై ప్రధాని మోదీ(గ్ఞ్ఞాంతి వ్యక్తంచేశారు. బాధితులకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

పాండిచ్చేరి, తమిళనాడు వైపు దూసుకొస్తున్న ఫెంగల్ తుఫాను

-పాండిచ్చేరి, కారైకాల్ ప్రాంతాల్లో పాఠశాలలు, కళాశాలలు మూసివేత

చెన్నై నవంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: బంగాళాఖాతంలో ఫెంగల్ తుఫాను తీవ్రమైంది. ఈ నేపథ్యంలో పాండిచ్చేరి, కారైకాల్ ప్రాంతాల్లో పాఠశాలలు, కళాశాలలు మూసేశారు. ఫెంగల్ తుఫాను కారణంగా అతి భారీ వర్షం పడొచ్చని తెలుస్తోంది.

లోతట్టు ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉన్నారు.భారత వాతావరణ శాఖ(ఐఎండి) తమిళనాడు,పాండిచ్చేరి, ఆంధ్రప్రదేశ్ లలో విస్తృతంగా వానలు పడే అవకాశం ఉందని హెచ్చరించింది. తాజా సమాచారం ప్రకారం తీవ్ర అల్పపీడనంగా ప్రారంభమైన ఫెంగల్ తుఫాను రాబోయే 24 గంటల నుంచి 48 గంటల్లో పూర్తి స్థాయి తుఫానుగా మారనున్నదని అంచనా. నవంబర్ 30న కారైకాల్, మహాబలిపురం మధ్య తుఫాను నేలను తాకే ముందు శ్రీలంక తీరాన్ని దాటి ఉత్తర-వాయువ్య దిశగా కదులుతుందని భావిస్తున్నారు.ప్రస్తుతం నాగపట్నంకు ఆగ్నేయంగా 310 కి.మీ, పాండిచ్చేరికి ఆగ్నేయంగా 410 కి.మీ, చెన్నైకి దక్షిణ-ఆగ్నేయంగా 480 కి.మీ దూరంలో ఉన్న ఫెంగల్ తుఫాను నవంబర్ 28 సాయంత్రం లేదా నవంబర్ 29 తెల్లవారు జామున తుఫానుగా బలపడుతుందని అంచనా. గంటకు 65-75 నుంచి 85 కిమీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయి, అయితే నిపుణులు తుఫాను భూమిని సమీపించే కొద్దీ కొద్దిగా బలహీనపడవచ్చని తెలిపారు. తీర ప్రాంతాల్లో భారీ వర్షాలు , బలమైన గాలులతో లోతైన అల్పపీడనంగా ఇది తీరం దాటుతుందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది.

కేంద్ర ఓబిసి జాబితాలో లేని కులాలను చేర్చాలి- బీసీ కమిషన్ తీర్మానం

హైదరాబాద్, నవంబర్ 29:తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల జాబితాలో ఉండి కేంద్ర ఓబిసి జాబితాలో చేర్చబడని 40 కులాలను వెంటనే కేంద్ర జాబితాలో కలిపేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరాలని బీసీ కమిషన్ తీర్మానించింది. ఇటీవల పాత ఉమ్మడి జిల్లా కేంద్రాలలో జరిపిన బహిరంగ విచారణలలో వచ్చిన వినతులను కమిషన్ ఈ రోజు ఖైరతాబాద్ లోని కార్యాలయంలో సమీక్షిస్తూ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.

రాష్ట్ర బీసీ జాబితాలో 130 కులాలు ఉండగా, కేంద్ర ఓబిసి జాబితాలో రాష్ట్రానికి చెందిన 90 కులాలు మాత్రమే ఉన్నాయి. కేంద్ర ఓబిసి జాబితాలో చేర్చబడని 40 కులాలను కేంద్ర జాబితాలో కలిపేందుకు రాష్ట్రం ఇదివరకే ప్రతిపాదనలు పంపినప్పటికీ, ఇంతవరకు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదు.

తొలి విడతలో అక్టోబరు 28 నుండి నవంబరు 2 వరకు, రెండవ విడతలో నవంబరు 18 నుండి 26 వరకు కమిషన్ బహిరంగ విచారణ జరిపిన విషయం తెలిసిందే. మరోవైపు, దొమ్మర, పిచ్చకుంట్ల, బుడబుక్కల, తమ్మలి తదితర కులాల పేర్లలో మార్పులను కోరుతూ వచ్చిన వినతులవట్ల సానుకూలంగా స్పందించిన కమిషన్ ఈ విషయంలో అంతకుముందు బీసీ వెల్ఫేర్ శాఖ సెక్రెటరీ ఇ. శ్రీధర్, ఐఏఎస్ కమిషన్ కార్యాలయంలో ఛైర్మన్, సభ్యులతో భేటీ అయ్యి వివిధ అంశాలు చర్చించారు. కమిషన్ సమావేశం అనంతరం అక్బరుద్దీన్ నేతృత్వంలో ఎం.ఐ.ఎం ప్రజాప్రతినిధుల బృందం కమిషన్ తో భేటీ అయ్యి ముస్లింలలో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ల పెంపు తదితర అంశాలపై విజ్ఞాపన పత్రం సమర్పించారు.



ఆహారపు అలవాట్లే ఆరోగ్య ప్రదాతలు.. !

శారీరక ఆరోగ్యంతోనే మానసిక ఉల్లాసం సిద్ధిస్తుందని మనకు తెలుసు. శారీరక ఆరోగ్య సంరక్షణకు అనేక పద్ధతులను, జీవన విధానాలను అలవర్చుకుంటున్నాం. శారీరక వ్యాయామం, యోగాప్రాణాయామాలను నిత్య దినచర్యల్లో భాగం చేసుకుంటున్నాం. శారీరక మానసిక ఆరోగ్య సిద్ధికి మనం తీసుకునే ఆహారం కూడా ప్రధాన భూమికలను నిర్వహిస్తున్నాయని తెలుసు కోవాలి. నిత్యం పోషకాహారం తీసుకోవడం ఎంత ముఖ్యమో నిరాహార లేదా ఉపవాసాలను దీక్షగా పాటించడం కూడా అంత కన్న ఉత్తమం. మన ఆరోగ్య సౌభాగ్యాలను కాపాడాలనే సదుద్దేశంతో మన సనాతన ధర్మం దేవుడి పూజలో భాగంగా వారానికి కనీసం ఒక రోజు ఉపవాసం లేదా నిరాహార దీక్షలో ఉండేలా సూచించింది. బరువు పెరగడం, జీవనశైలి వ్యాధుల బారిన పడడానికి ప్రధాన కారణాలుగా విచక్షణ మరిచి తిండి తినడం, అదుపు తప్పి ఫాస్ట్ ఫుడ్స్ లేదా జంక్ ఫుడ్స్ తీసుకోవడం లాంటివి దోహదపడుతున్నాయని తెలుసుకోవాలి.

ఆహారపు అలవాట్లే ఆరోగ్య ప్రదాతలు:

బరువును అదుపులో పెట్టుకోవడం, కొవ్వును కరిగించడం, శారీరక ఆరోగ్యానికి పునాదులు వేయడం, ప్రమాదకర ఆహారపు అలవాట్లు లాంటి అంశాల పట్ల అవగాహన కల్పించడానికి మన కర్తవ్యం కావాలి. మూఢనమ్మకాలకు మంగళం పాడుతూ సంపూర్ణ శారీరక, మానసిక ఆరోగ్యాల పరిరక్షణకు వారానికి ఒక సారి నిరాహార లేదా ఉపవాసాలను పాటించాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. శరీర సానుకూలత (బాడీ పాసిటివిటి) సూత్రాలు, పరిమిత ఆహారం తీసుకునే నియమాలను పాటించడం మన జీవనశైలిలా భాగం చేసుకోవాలి. "అసబద్ధ ఆహారపు అలవాట్ల కట్టడితో నిన్ను నువ్వు కాపాడుకోవడం" అనబడే అంశాన్ని గుర్తుంచుకోవాలి. ఉపవాస దీక్షలతో పలు వ్యాధులు కట్టడి చేయబడి సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రజలకు అవగాహన కల్పించడానికి ఈ వేదిక ఉపయుక్తం అవుతున్నది.

ప్రతికూల ఆహార అలవాట్లు విషతుల్యం:

విచక్షణారహిత ఆహారపు అలవాట్లు విషతుల్యమని, మనం తీసుకునే ఆహారమే మనకు ఆరోగ్య ప్రదాతలని, కృత్రిమ అందాల వేటలలో అసంబద్ధ ఆహారపు అలవాట్ల చేసుకోవడం లాంటి విషయాలను ప్రజలకు అవగాహన కల్పించాలి. మనం తిన్న ఆహారం మనకు అవసర శక్తిని, చైతన్యాన్ని, పోషకాలను అందించాలి. "మన ఆరోగ్యం మన చేతుల్లోనే, మన ఆరోగ్యం మన కంచంలోనే" అనే నినాదాలను నిత్యం స్మరణ చేసుకోవాలి. 'పరిపూర్ణ ఆరోగ్య సిద్ధికి పరిమిత సమతుల ఆహారం' అనే సూక్తిని సదా గుర్తుంచుకోవాలి. "నిన్ను నువ్వు ప్రేమించడం అంటే ఏం తినాలి, ఎంత తినాలి, ఎప్పుడు తినాలి, ఎప్పుడు మానాలి" అనే విషయాలను అర్థం చేసుకొని ఆచరించడమే. ఆహారపు అలవాట్లు అదుపు తప్పితే స్థూలకాయం, రోగాలకు ఆహ్వానం, సైజ్ పెరిగి ఆత్మన్యూనత లాంటి అనారోగ్యాలు మనల్ని ఆక్రమిస్తాయి. అసంబద్ధ ఆహారపు రుచులకు లొంగితే మన శరీరం అనారోగ్యాల బారిన పడుతుంది.

నిరాహార లేదా ఉపవాసాల ప్రయోజనాలు:

మన ఇంట్లో పిల్లలకు, యువతకు సరైన ఆహారపు అలవాట్లను అందించడం పెద్దల కనీస బాధ్యత. అసాధారణ, ప్రతికూల శరీర మార్పులకు పునాది మనం నిత్యం తీసుకునే ఆహారమే అని గమనిస్తూ నిరాహార లేదా ఉపవాస క్రమశిక్షణలు పాటిస్తూ మన ఆరోగ్య పరిరక్షణకు బాటలు వేసుకుందాం. క్రమశిక్షణతో ఉపవాసాలు పాటిస్తే గ్లూకోజ్ నియంత్రణ, ఇన్సులిన్ అదుపు, జీవక్రియ ఆరోగ్యం, గుండె ఆరోగ్యం, బరువు అదుపు, దీర్ఘాయువు, మెదడు ఆరోగ్యం, వాపులు తగ్గడం, హార్మోన్ నియంత్రణ, బిపీ అదుపు, చెడు కొలెస్టరాల్ స్థాయి తగ్గుదల, ఒత్తిడి నియంత్రణ, వృద్ధాప్య నియంత్రణ, క్యాన్సర్ కట్టడి, సానుకూల జీర్ణ క్రియ, థైరాయిడ్ రుగ్మతల కట్టడి, సరళ సుస్థిర జీవన యాత్రలు లాంటి ప్రయోజనాలు కలుగుతాయి. ఎప్పుడూ తింటేనే కాదు ఉపవాసం ఉంటే కూడా ఆరోగ్యం సిద్ధిస్తుందని తెలుసుకుందాం, పరిమిత మోతాదులో పోషకాహారం మాత్రమే తీసుకుందాం. క్రమం తప్పకుండా ఉపవాసాలు పాటిస్తూ మన శరీరానికి ఉపశమనం, విశ్రాంతులను బహుకరిద్దాం.

– డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

ఇక ప్రయాణికులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం: భారత రైల్వే చర్యలు

న్యూఢిల్లీ, నవంబర్ 29:ప్రయాణికులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించడానికి భారతీయ రైల్వే నిరంతరం మెరుగైన చర్యలు తీసుకుంటోంది. ఈ దిశగా కింది చర్యలు తీసుకుంది:

నిర్దేశిత బేస్ కిచెన్ల నుంచి ఆహారం సరఫరా.కొన్ని ప్రాంతాలను గుర్తించి ఆధునిక బేస్ కిచెన్లు ఏర్పాటు చేయడం.

ఆహారాన్ని సిద్ధం చేసే విధానాన్ని మెరుగ్గా పర్యవేక్షించడం కోసం సీసీటీవీ కెమెరాల ఏర్పాటు.

ఆహారం కోసం వంటనూనె, పిండి, బియ్యం, పప్పులు, మసాలా, పనీర్, పాల ఉత్పత్తుల వంటి పదార్థాల్లో మంచిపేరున్న వాటిని, మన్నికైన వాటిని ఎంపిక చేయడం.

ఆహార భద్రత, పరిశుభ్రమైన పద్ధతులను పర్యవేక్షించడానికి బేస్ కిచెన్లలో ఆహార భద్రతా పర్యవేక్షకులను నియమించడం.రైళ్లలో ఆన్ బోర్డ్ ఐఆర్ సీటీసీ పర్యవేక్షకులను నియమించడం.

ఆహార ప్యాకెట్లపై క్యూఆర్ కోడ్ లను ప్రవేశపెట్టడం. వాటి ద్వారా వంటశాల పేరు, ప్యాక్ చేసిన తేదీ వంటి వివరాలు తెలుసుకునేందుకు అవకాశం కల్పించడం.

బేస్ కిచెన్లు, వంట ప్రదేశాలను (పాంట్రీ కార్) రోజూ బాగా శుభ్రం చేయడం, ఎప్పటికప్పుడు (ప్రతీ 15 రోజులకు ఒకసారి) వంటశాలల్లో క్రిమి నియంత్రణ చర్యలు చేపట్టడం.

ఆహార భద్రతా నిబంధనలకు అనుగుణంగా.. ప్రతీ కేటరింగ్ యూనిట్ నిర్దేశిత ఆహార భద్రతా అధికారుల నుంచి భారత ఆహార భద్రత, ప్రమాణాల అధీకృత సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ధ్రువీకరణ పొందడం తప్పనిసరి.

పర్యవేక్షణ, నియంత్రణ యంత్రాంగంలో భాగంగా ఎప్పటికప్పుడు ఆహార నమూనాలను సేకరించి రైళ్లలో ఆహార నాణ్యతను మెరుగుపరచడం.

వంట ప్రదేశాలు (పాంట్రీ కార్), బేస్ కిచెన్లలో పరిశుభ్రత, నాణ్యతను పరీక్షించడానికి థర్డ్ పార్టీ అడిట్ నిర్వహిస్తారు. వినియోగదారులు నుంచి అభిప్రాయ సేకరణ కూడా చేస్తున్నారు.

ఆహారభద్రత అధికారులతోపాటు రైల్వే/ఐఆర్ సీటీసీ అధికారుల రోజువారీ, ఆకస్మిక తనిఖీలు.రైళ్లలో ఆహార పదార్థాల జాబితాను హేతుబద్ధంగా వ్యవస్థీకరించడం.. తద్వారా మధుమేహ వ్యాధిగ్రస్తులు, పిల్లల వంటి వివిధ వర్గాల వ్యక్తుల కోసం చిరుధాన్యాల ఆధారిత స్థానిక ఉత్పత్తులు సహా తగిన ఆరోగ్యకరమైన ఆహార ఎంపికలను రూపొందించడానికి అవకాశం ఉంటుంది. ప్రాధాన్యం ప్రకారం ప్రాంతీయ వంటకాలు, కాలానుగుణమైన పదార్థాలను పరిచయం చేయవచ్చు.

కేటరింగ్ సిబ్బంది నైపుణ్యాలను మెరుగుపరిచి.. వినియోదారులకు అందించే సంభాషణ, మర్యాదగా ప్రవర్తించడం, సేవా ప్రమాణాలు, వస్త్రధారణ, పరిశుభ్రత వంటి సేవలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టేలా ఐఆర్ సీటీసీ ఎప్పటికప్పుడు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుంది.

రైల్లో ఆహార పదార్థాలను ముందుగా నిర్ణయించిన ధరలకే విక్రయిస్తారు. భారతీయ రైల్వేల్లో కేటరింగ్ వస్తువుల ధరలపై సమాచారం అందించడానికి- సంక్షిప్త సందేశాలు/మెయిల్ లు, జాబితాతోపాటు ధరలను వెయిటర్లు ప్రదర్శించడం వంటి చర్యల ద్వారా ప్రయాణికులకు వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. అంతేకాకుండా ప్రత్యేక పర్యవేక్షణ కార్యక్రమాలు సహా రోజువారీ, ఆకస్మిక తనిఖీలను రైల్వే/ఐఆర్ సీటీసీ అధికారులు చేపడుతున్నారు.

లోకసభలో ఓ లిఖితపూర్వక సమాధానంలో కేంద్ర రైల్వే, సమాచార-ప్రసార, ఎలక్ట్రానిక్స్-సాంకేతిక శాఖ మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ ఈ సమాచారం అందించారు.

55వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో ప్రతిష్ఠాత్మక ఐసీఎఫ్ టీ - యునెస్కో గాంధీ పతకాన్ని గెలుచుకున్న 'క్రాసింగ్'.. స్వీడిష్ దర్శకుడు లెవాన్ అకిన్ తెరకెక్కించిన చిత్రం

న్యూఢిల్లీ, నవంబర్ 29:గోవాలో జరుగుతున్న 55వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఇఫీ)లో స్వీడిష్ దర్శకుడు లెవాన్ అకిన్ తెరకెక్కించిన క్రాసింగ్ చిత్రం ప్రతిష్ఠాత్మక ఐసీఎఫ్ టీ ? యునెస్కో గాంధీ పతకాన్ని గెలుచుకుంది. శాంతి, అహింసా విలువలను ప్రతిబింబించేదిగా.. మానవ హక్కులను ప్రోత్సహించేదిగా ఈ సినిమాను ఈ పురస్కారం గుర్తించింది. ఈ విలువలను శక్తిమంతంగా ప్రదర్శించడం 'క్రాసింగ్' ఎంపికకు కారణమైంది. విజేతకు యునెస్కో గాంధీ పతకం, ధ్రువీకరణ పత్రాలను అందిస్తారు.

అద్భుతమైన చిత్ర నిర్మాణ విలువలతోపాటు స్త్రీపురుష సమానత్వం, సామాజిక అవగాహనపై ఆలోచనాత్మకంగా సాగిన కథనాన్ని న్యాయ నిర్ణేతలు అభినందించారు. "ప్రేమ, అవగాహన ఈ సినిమాలో మనసును హత్తుకునే అంశాలు" అని న్యాయ నిర్ణేతలు వ్యాఖ్యానించారు.

అంతర్జాతీయ చలనచిత్ర, టీవీ, దృశ్యశ్రవ్య ప్రసార మండలి (ఐసీఎఫ్ టీ), యునెస్కో సహకారంతో నెలకొల్పిన ఈ పురస్కారాన్ని సహనం, సాంస్కృతిక సామరస్యం, శాంతియుత సంస్కృతి ఆదర్శాలను ప్రతిబింబించే చిత్రాలకు అందిస్తారు.చాలా ఏళ్ల క్రితం అదృశ్యమైన తన మేనకోడలిని వెతుక్కుంటూ జార్జియా నుంచి ఇస్తాంబుల్‌కు ఓ యువకుడితో ప్రయాణం మొదలుపెట్టిన ఒక వృద్ధ మహిళ కథను 'క్రాసింగ్' సినిమా చెప్తుంది. ఓ వాగ్దానాన్ని నెరవేరుస్తున్న స్త్రీగా అద్భుతంగా నటించిన ఎంజియా అరబలి పాత్ర.. అనూహ్యంగా లింగపరమైన సమస్యలు, సమానత్వం వంటి అంశాలను తెరపైకి తెస్తుంది. ప్రేమ, అవగాహన, తరతరాల అనుబంధాలపై ఈ చిత్రం అందమైన కథనాన్ని అల్లింది. సామాజిక, సాంస్కృతిక అంశాలను పదునుగా వ్యాఖ్యానించింది.

గోల్డెన్ పీకాక్ గెలుచుకున్న లిథువేనియన్ చిత్రం 'టాక్సిక్'

న్యూఢిల్లీ, నవంబర్ 29:గోవాలో జరుగుతున్న 55వ అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో అందరూ ఉత్కంఠతో ఎదురుచూస్తున్న ప్రకటన వెలువడింది. ఇఫీ 2024లో ఉత్తమ కథాచిత్రం (ఫీచర్ ఫిల్మ్)గా లిథువేనియన్ చిత్రం 'టాక్సిక్' ప్రతిష్ఠాత్మక గోల్డెన్ పీకాక్ పురస్కారాన్ని దక్కించుకుంది.

నిర్మాత గీదర్ బురోకైట్ తో కలిసి దర్శకుడు సాల్ బ్లూవైట్ గోల్డెన్ పీకాక్ ట్రోఫీ, సర్టిఫికేట్, రూ. 40,00,000 నగదు బహుమతిని పంచుకుంటారు.

మూర్తి భౌతిక, సామాజిక నేపథ్యంలో సునిశితత్వం, సహానుభూతులతో కౌమార దశను చిత్రిస్తూ తెరకెక్కించిన చిత్ర కథనాన్ని; సినిమా నీ న్యాయనిర్ణేతలు అభినందించారు.

"కౌమార దశనూ, ఆర్థికంగా వెనుకబడిన దేశాల్లో పెరగడానికి సంబంధించి కఠినమైన వాస్తవాలనూ అత్యంత సునిశితత్వం, సహానుభూతులతో చిత్రించడం.. అదేవిధంగా భౌతిక, సామాజిక నేపథ్యంలో కౌమార దశను చిత్రిస్తూ కథనాన్ని నడిపించడం" ద్వారా టాక్సిక్ ఉత్తమ చిత్రంగా నిలిచిందని న్యాయనిర్ణేతలు వ్యాఖ్యానించారు.

కలుషితమైన భౌతిక, సామాజిక వ్యవస్థల నేపథ్యంలో వచ్చిన కౌమార దశ కథకు ఆ పేరు అచ్చంగా సరిపోయింది. దౌర్భల్యంలోనూ, ఉన్నత స్థితిలో ఉన్నప్పుడూ.. అన్ని రకాల పరిస్థితుల్లో మానవ శరీరపు తీరు టాక్సిక్ సినిమాలో కేంద్ర బిందువు.

పదమూడేళ్ల వయస్సున్న మరీజా తన అమ్మమ్మతో కలిసి నివసిస్తున్న ఓ పారిశ్రామిక ప్రాంతంలో తను ఇమడలేకపోతూ ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొందో చిత్రంలో చూడొచ్చు. ఎప్పుడూ కొట్లాడుతూ ఉండే తన మిత్రురాలు క్రిస్టినాతో మరీజా స్నేహం ఎప్పుడూ స్థిరంగా ఉండేది కాదు. వారిద్దరూ స్థానికంగా ఉన్న ఓ వోడలింగ్ స్కూలులో చేరారు. మసకబారిన, మారుమూల బతుకులకు దూరంగా.. ఆకర్షణీయమైన జీవితాన్ని పొందేలా చేస్తామని ఆ స్కూల్ వారికి మాటిచ్చింది. అయితే, ఆ స్కూలు కోసం కావాల్సిన ఆర్థిక, భౌతిక అవసరాల కారణంగా అసాధ్యమైన సౌందర్య ప్రమాణాలకు అనుగుణంగా వారి యువ దేహాలను మలచుకోవడానికి అత్యంత కఠినమైన, ప్రమాదకరమైన మార్గాలను వారు ఎంచుకోవాల్సి వచ్చింది.

ఈ చిత్రంలో అత్యుత్తమ ప్రదర్శనకు గాను వెస్టా మాటులిటే, ఐవా రుపేయికైటే సంయుక్తంగా ఉత్తమ నటి పురస్కారాన్ని అందుకున్నారు. "తొలిసారి నటించిన ఈ ఇద్దరూ అసాధారణ ప్రతిభ కనబరిచారు. భౌతికంగా, భావోద్వేగపరంగా మరీజా, క్రిస్టినా పాత్రలతో తాదాత్మ్యం చెందారు. ఈ పాత్రలు ఎప్పటికీ గుర్తుంటాయి" అని న్యాయ నిర్ణేతలు వ్యాఖ్యానించారు.

రచనంటే అదో ఒంటరి ప్రయాణం..ఇక దర్శకత్వమేమో సమన్వయం, విశ్వాసాల మిశ్రమం: శ్రీ బోదాన్

న్యూఢిల్లీ, నవంబర్ 29:శ్రీ బోదాన్ స్లామా దర్శకత్వంలో శ్రీ పీటర్ ఓక్రోపెక్ నిర్మించిన చలనచిత్రం 'డ్రై సీజన్' (మొదట దీనికి 'సుఖో' అని పేరు పెట్టారు) ను గోవాలో నిర్వహిస్తున్న 55వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఐఎఫ్ఎఐ..'ఇఫీ') లో ముగింపు చిత్రంగా ఉంది. చాలా కాలంగా ప్రేక్షకలోకం ఆత్రంగా ఎదురుచూస్తున్న ఈ చిత్రం గురించి తెలియజేయడానికి పత్రికావిలేకరుల సమావేశాన్ని ఏర్పాటుచేశారు. పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిత్రంలో పర్యావరణాన్ని గురించి, తరాలవారీగా తలెత్తుతున్న సవాళ్ళను గురించి ప్రధానంగా చర్చ సాగింది.

పచ్చని పైరులతో నిండిన పంట పొలాల మధ్య చిత్ర కథ జోసెఫ్ అనే యాభై ఏళ్ళ వయసున్న రైతు అతడి భార్య ఇవా, ముగ్గురు పిల్లలతో కలసి చక్కని జీవనం గడపాలని తపిస్తూ ఉండడాన్ని సూచిస్తూ ఆరంభమవుతుంది. లాభాల కోసం వ్యవసాయాన్ని వ్యాపారంగా నడిపే యజమాని విక్టర్ తో జోసెఫ్ తరచు గొడవపడుతుంటాడు. దుర్వికృతం కారణంగా పల్లెలో తాగునీటి ఎద్దడి తలెత్తడంతో కుటుంబాల మధ్య ఉద్రిక్తతలు పెరిగిపోతాయి. దీనికి తోడు, విక్టర్‌కు తన కొడుకుతో విభేదాలు వచ్చి కథ పాకాన పడుతుంది.

మానవులకు, పర్యావరణానికి మధ్య ఉన్న విశ్వజనీన బంధానికి అద్దం పడుతూ, ప్రాకృతిక వనరులను రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని దర్శకుడు శ్రీ బోదాన్ స్లామా మొదట సూచిస్తారు. ఇది మనిషి తనలోని అంతరాత్మను కాపాడుకోవడం వంటిదేనని ఆ తరువాత ఆయన మార్మికంగా చెబుతూ పోతారు. ఈ చిత్ర కథకు తెర రూపాన్ని ఇవ్వడానికి మూడేళ్ళు పట్టిందని, ఒకసారి రాసింది మళ్ళీ తిరగరాస్తూ అలా మొత్తం పదకొండుసార్లు మెరుగులు దిద్దానని ఆయన సమావేశంలో వెల్లడించారు. ఈ చలనచిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకు రావడంలో తనకు నటీనటులు, చిత్ర నిర్మాతలు ఎంతగానో సహకరించారంటూ వారికి ఆయన కృతజ్ఞత తెలిపారు.

నిర్మాత శ్రీ పీటర్ ఓక్రోపెక్ చిన్న దేశాలలో కళాత్మకత ప్రధానమైన చలనచిత్రాలను నిర్మించడం, అందుకు నిధులను సేకరించడంలో ఉన్న కష్టాలను గురించి వివరించారు. అంతర్జాతీయ సహకారం లభిస్తే బాగుంటుందనేది ఆయన అభిప్రాయం. మానవజాతి మనుగడ దీర్ఘకాలంపాటు కొనసాగడం, కుటుంబ విలువలు, తరాల మధ్య అంతరాలు వంటి అంశాలపై దృష్టి పెట్టిన ఈ చిత్రం ప్రపంచంలో ఏ మూలనైనా ప్రేక్షకుల హృదయాలను స్పర్శించగలిగే విధంగా ఉందంటూ, ఈ చిత్రం సందర్భోచితంగా రూపుదిద్దుకొందని, ఇప్పుడున్న వాతావరణాన్ని ప్రతిఫలించిందంటూ శ్రీ పీటర్ ఓక్రోపెక్ మెచ్చుకొన్నారు.

చిత్ర కథ సమకాలీన విషయాలకు అద్దం పడుతుందని, యువ ప్రేక్షకలోకం వారి భవిష్యత్తును వారంతట వారే తీర్చిదిద్దుకోవాలని, చిత్ర నిర్మాత అంటున్నారు. 'డ్రై సీజన్' ఒక్క భారతదేశంలోనే కాదు, ప్రపంచం అంతటా సార్థక మాటామంతీని మొదలుపెట్టి, చూపరులకు మానవత, ఇంకా ప్రకృతికి మధ్య గల సున్నిత సమతుల్య బంధాన్ని గుర్తు చేస్తూ ఉంటుందన్న ఆశను దర్శకుడు శ్రీ బోదాన్ స్లామా వ్యక్తం చేస్తూ, ఈ కార్యక్రమాన్ని ముగించారు.

కనకదుర్గమ్మ సేవలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

-స్వాగతం పలికిన ఈవో కె ఎస్ రామారావు

అమరావతి, నవంబర్ 28:విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై

ఉన్న శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలోని కనకదుర్గమ్మ సన్నిధికి మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ వచ్చారు. శుక్రవారం మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కుటుంబసభ్యులతో కలిసి శ్రీ అమ్మవారి దర్శనార్థం ఆలయానికి విచ్చేయగా, ఆలయ ఈవో కె.ఎస్ రామారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, అమ్మవారి దర్శనం కల్పించారు.అనంతరం ఆలయ వేదపండితు లు వీరికి వేదాశీర్వచనం చేయగా, ఈవో రామారావు అమ్మవారి శేషవ స్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవో తో పాటుగా ఆలయ డిప్యూటీ ఈవో ఎమ్.రత్న రాజు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు మంజూరు చేసి జిల్లా ప్రజల ఆర్థికాభివృద్ధిలో పాలుపంచుకోవాలి. కలెక్టర్

-మహిళా సాధికారత లక్ష్యంగా స్వయం సహాయక మహిళా సంఘాలకు రుణాలు అందించాలి

- జిల్లాలో రైతుల రుణమాఫీ సమర్థవంతంగా అమలులో బ్యాంకులు యొక్క సేవా దృక్పథం అభినందనీయం

-కలెక్టరేట్ కార్యాలయంలో బ్యాంక్ కంట్రోలర్స్ డిసిసి, డీఎల్ఆర్సి సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, నవంబర్ 29: శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో సమావేశ హాలులో సంబంధిత వివిధ బ్యాంక్ కంట్రోలర్ తో జిల్లాలోని డీసీసీ / డిఎల్ఆర్సి మీటింగ్ (for Quarter ended September 2024) నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల రుణమాఫీ అమలులో బ్యాంకర్ల సేవా దృక్పథం అభినందనీయమని ఇదే వర వడి కొనసాగిస్తూ బ్యాంకర్ల లక్ష్యాలను సాధించాలన్నారు. జిల్లాలో వ్యవసాయ రంగానికి, మహిళా సాధికార లక్ష్యంగా రుణాలు మంజూరుకు అత్యంత ప్రాధాన్యత నివ్వాలని, గత సంవత్సర లక్ష్యాల కంటే మెరుగైన లక్ష్యాలు సాధించడానికి చిత్తశుద్ధితో పనిచేయా లని ప్రాధాన్యతా రంగానికి బ్యాంకులు పూర్తి లక్ష్యాలు సాధించడానికి కృషి చేయాలన్నారు. పీఎం విశ్వకర్మ పథకానికి సంబంధించి., ఎస్సీ ,మైనారిటీ గిరిజన సంక్షేమ శాఖ రుణ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు జిల్లా వార్షిక ప్రణాళిక ప్రకారం వివిధ రంగాలలో రూ॥ 5857 కోట్లు రుణాల లక్ష్యం ఉండగా, రూ॥ 2646 కోట్లు (45.18%) రుణాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇందులో వ్యవసాయేతర రుణాల లక్ష్యం రూ॥3671 కోట్లు ఉండగా, మెదక్ జిల్లాలో రూ॥1663 కోట్లు (45.30%) మంజూరు చేయటం జరిగిందన్నారు. పంట రుణాల లక్ష్యం రూ॥2274 కోట్లు ఉండగా, మెదక్ జిల్లాలో ఖీబ.973 కోట్లు (42.78%) మంజూరు చేశారన్నారు. కలెక్టరు గారు ప్రణాళిక ప్రకారం రుణాల లక్ష్యాన్ని మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ మీటింగ్ లో అదనపు కలెక్టర్ రెవిన్యూ నగేష్ ఆఖీఆ – శ్రీ శ్రీనివాస రావు, ఎల్డీఎం – శ్రీ నరసింహ మూర్తి, డీడీఎం నాబార్డ్ – శ్రీ కృష్ణ తేజ, ఎల్డిఓ ఆర్డీఐ – ఎఎబి. పల్లవి, ఆర్సేటీ డైరెక్టర్ – శ్రీ వి రాజేంద్ర ప్రసాద్, వివిధ వాణిజ్య, సహకార మరియు RRBబ్యాంకుల కంట్రోలర్స్, ఇతర సీనియర్ డిస్ట్రిక్ట్ డిపార్ట్మెంట్ అధికారులు పాల్గొన్నారు

కన్నీరు తుడుస్తా .. కష్టాలు తీరుస్తా: ప్రజాదర్బార్ లో హోమ్ మంత్రి భరోసా..

-ప్రతి సమస్యకూ పరిష్కారం చూపిస్తా.

-అర్జీదారులకు హోం మంత్రి హామీ.

-ప్రజాదర్బార్ లో ఫిర్యాదుల వెల్లువ.

అమరావతి, నవంబర్ 28: సమస్యలో ఉన్న ప్రజల కన్నీరు తుడుస్తా..వారి కష్టాలు తీరుస్తానంటూ హోం మంత్రి వంగలపూడి అనిత భరోసానిచ్చారు.ప్రతి సమస్యకూ పరిష్కారం చూపించడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని ఉద్ఘాటించారు. నక్కపల్లి ఎమ్మార్వో కార్యాలయం వద్ద ఆమె శుక్రవారం ప్రజదర్బార్ నిర్వహించారు. పాయకరావుపేట నియోజకవర్గం నాలుగు మండలాలు నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరాగా హోం మంత్రి అర్జీలు స్వీకరించారు.

వారితో ఆప్యాయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.సుమారు 1000 కు పైగా అర్జీలు వచ్చాయి. భూ సమస్యలు, శాంతిభద్రతలు,కుటుంబ సమస్యలు, కొత్త ఫించన్లు,రేషన్ కార్డులు తదితర అంశాలపై అధికంగా ఫిర్యాదులు వచ్చాయి. ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరిస్తామని ఆమె చెప్పారు. కొన్ని సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి అక్కడికక్కడే పరిష్కరించారు. జిల్లా అధికారులతో పాటు పాయకరావుపేట నియోజకవర్గంలో నాలుగు మండలాల అధికారులు పాల్గొన్నారు.

పోర్ట్ లోకి రేషన్ బియ్య..ఎలా వచ్చాయంటూ అధికారులను నిలదీసిన పవన్ కల్యాణ్

అమరావతి, నవంబర్ 28:కాకినాడలోని యాంకరేజ్ పోర్టులో రేషన్ బియ్యం ఎలా వచ్చాయంటూ అధికారులను నిలదీశారు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ . ఈ పోర్ట్ నుంచి రేషన్ బియ్యం ఇంత భారీగా అక్రమ రవాణా జరుగుతుంటే ఏం చేస్తున్నారని పోర్ట్ అధికారులపైనా, డిఎస్పీ పైనా ఫైర్ అయ్యారు.. ఇటీవల బియ్యం అక్రమ రవాణా వ్యవహారం వెలుగు చూసిన నేపథ్యంలో కాకినాడ పోర్టును మంత్రి నాదెండ్ల మనోహర్తో కలిసి పరిశీలించారు. అలాగే రెండు రోజుల క్రితం కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ ఆధ్వర్యంలో సముద్రం లోపల సుమారు 9 నాటికల్ మైళ్ల దూరంలో రవాణాకు సిద్ధమై పట్టబడిన నౌక వద్దకు సముద్రంలో పయనించి అక్కడికి చేరుకున్నారు.. అందులో ఉన్న 640 టన్నుల బియ్యాన్ని పవన్ స్వయంగా వెళ్లి చూశారు. పశ్చిమ ఆఫ్రికా దేశాలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న బార్జో బియ్యాన్ని పరిశీలించారు.

ఎమ్మిగనూరు కౌన్సిల్ సమావేశం రసాభాస

-ఇరు పక్షాల కౌన్సిల్ సభ్యుల మధ్య రగడ

-క్షమాపణల కొరకు ఒకరిపై ఒకరు ఆరోపణలు

-పోడియం ముందు బైఠాయింపు

-గందరగోళం లోనే ముగిసిన సమావేశం

అమరావతి, నవంబర్ 28:ఎమ్మిగనూరు పురపాలక సంఘంలో శుక్రవారం జరిగిన కౌన్సిల్ సమావేశం లో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య రగడ రాజేసుకుంది. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కెయస్ రఫు అధ్యక్షత జరిగిన సమావేశంలో ముందుగా అజెండా అంశాలు ఆమోదిస్తున్నట్లు వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్ తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశామని, అందుకు పూర్తి సహకారం అందించిన ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి కి కృతజ్ఞతగా ఓం శాంతి సర్కిల్ కు ఆయన పేరు పెట్టాలనీ,అలాగే గోనెగండ్ల బైపాస్ కు అనేక కార్యాలయాల స్థల దాత హనన్ బేగ్ పేరు పెట్టాలని సూచించారు.

అనంతరం కౌన్సిలర్ నాగేషప్ప మాట్లాడుతూ గత సమావేశంలో నాల్గవ వార్డు కౌన్సిలర్ రామదాస్ గౌడు చైర్మన్ ను అసభ్య పదజాలంతో సంభోదించారని అందుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అందుకు అధికార పార్టీ కౌన్సిలర్లు గత సమావేశంలో మహిళలు ఉన్నారని చూడ కుండా పార్టీ ఫిరాయించిన కౌన్సిలర్లు కు సిగ్గు లేదా అని కౌన్సిలర్ శివ ప్రసాద్ మాట్లాడం సమంజసం కాదని,

ఆసమయంలో తమకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని కోరామన్నారు. అయినా చైర్మన్ సమావేశం ముగించినట్లు బెల్ మోగించి వెళ్లారని అన్నానని రామదాస్ గౌడు తెలిపారు.

అసభ్యంగా మాట్లాడటం నిజమేనని క్షమాపణలు చెప్పాలని వైస్ చైర్మన్ కలుగ జేసుకుని డిమాండ్ చేశారు. క్షమాపణ చెప్పేంత వరకు సమావేశం జరుగనీయమని భీష్మించుక కూర్చున్నారు. అందుకు టిడిపి కౌన్సిలర్లు నిజానికి మీరే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఇరువురు క్షమాపణల పేరుతో పోడియం ముందు బైఠాయిం చారు. ఇరువురు సంయమనం పాటించాలని చైర్మన్ పదే పదే చెప్పినా ఇరు పక్షాలు వినక పోవడంతో సమావేశం ముగించారు.అంతకు ముందు కౌన్సిలర్ దయ

ఆయుష్మాన్ భారత్- ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజనతో కలిసి పనిచేయనున్న ఉద్యోగుల ప్రభుత్వ బీమా సంస్థ

న్యూఢిల్లీ, నవంబర్ 29:ఆరోగ్య ప్రయోజనాలు, వైద్య పరమైన రక్షణ అందిస్తూ కార్మికుల సామాజిక భద్రత కోసం కృషిచేయడం ప్రభుత్వ ప్రాధాన్యంగా ఉంది. 'వికసిత భారత్' దిశగా పనిచేసేలా కార్మిక శక్తిని మరింత ఉత్పాదకంగా తీర్చిదిద్దడానికి ఇది దోహదం చేస్తుంది.

ఈ నేపథ్యంలో కార్మిక, ఉపాధి శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ మార్గదర్శకత్వంలో కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య రక్షణ సదుపాయాల లభ్యతను మరింత విస్తరించేందుకు ఈఎస్ఐసీ కృషి చేస్తోంది. ఆయుష్మాన్ భారత్-ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన (ఏబీ పీఎంజేఏవై)తో ఉద్యోగుల ప్రభుత్వ బీమా సంస్థ(ఈఎస్ఐసీ)ను కలపడం ద్వారా ఈ దిశగా చర్యలు చేపడుతోంది. ఈ కార్యక్రమం 14.43 కోట్ల మంది ఈఎస్ఐ లబ్ధిదారులు, వారి కుటుంబాలకు ప్రయోజనం చేకూరుస్తుంది. దీనిద్వారా దేశవ్యాప్తంగా నాణ్యమైన, సమగ్రమైన ఆరోగ్య రక్షణ సేవలు వారికి మరింత అందుబాటులోకి వస్తాయి. ఈ నేపథ్యంలో ఈ రెండు పథకాల ఏకీకరణ, వాటి అమలుకు సంబంధించి మొత్తం ప్రక్రియలో పురోగతిని కార్మిక, ఉపాధి శాఖ కార్యదర్శి శ్రీమతి సుమితా దార్వా గురువారం సమీక్షించారు.

ఈ కలయిక ద్వారా ఈఎస్ఐసీ లబ్ధిదారులు దేశవ్యాప్తంగా 30,000 ఏబీ-పీఎంజేఏవై పరిధిలోని ఆస్పత్రుల్లో చికిత్స ఖర్చులపై ఎలాంటి ఆర్థిక పరిమితీ లేకుండా ద్వితీయ, తృతీయ వైద్య సేవలను పొందే అవకాశం ఉంటుందని ఈఎస్ఐసీ డీజీ శ్రీ అశోక్ కుమార్ సింగ్ తెలిపారు. ఈ భాగస్వామ్యం ఆరోగ్య రక్షణ సేవల లభ్యతను మెరుగుపరచడం మాత్రమే కాకుండా, చికిత్స ఖర్చులు పూర్తిగా దీని పరిధిలోకి వస్తాయన్న భరోసా కూడా అందిస్తుంది. లబ్ధిదారులందరికీ ఆరోగ్య రక్షణను సులభంగా, తక్కువ వ్యయంతో అందుబాటులోకి తెస్తుంది. దేశవ్యాప్తంగా ఉన్న ధార్మిక (చారిటబుల్) ఆస్పత్రుల్లో కూడా ఈఎస్ఐ లబ్ధిదారులకు చికిత్స అందుబాటులో ఉంటుంది.

ఈఎస్ఐ పథకం కింద ప్రస్తుతం వైద్యపరమైన రక్షణ సేవలందిస్తున్న 165 ఆస్పత్రులు, 1590 డిస్పెన్సరీలు, 105 డిస్పెన్సరీ కం బ్రాంచ్ ఆఫీసులు (డీసీబీవోలు), దాని పరిధిలోని దాదాపు 2900 ప్రైవేటు హాస్పిటళ్లు కొనసాగుతాయి. ఏబీ-పీఎంజేఏవైతో ఈఎస్ఐ కలయిక.. దేశంలోని కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు నాణ్యమైన, అందుబాటులో ఉండే వైద్య సంరక్షణ సేవలందించే దిశగా ఈఎస్ఐసీ చర్యలను మరింత బలోపేతం చేస్తుంది.

దేశంలోని మొత్తం 788 జిల్లాలకు గాను 687 జిల్లాల్లో ఈఎస్ఐ పథకం అమలైంది. ఈ ప్రక్రియ పదేళ్లలో గణనీయంగా వృద్ధి చెందింది. పీఎంజేఏవైతో సమన్వయ సహకారాల వల్ల.. వైద్య సంరక్షణ ఏర్పాట్ల ద్వారా ఈఎస్ఐ పథకం అది అమలు కాని జిల్లాలకు కూడా విస్తరించడానికి అవకాశం కలిగింది.

ఏబీ-పీఎంజేఏవైతో ఈఎస్ఐసీ కలయిక.. అందరికీ ఆరోగ్య నదుపాయాలు అందేలా ప్రోత్సహించడంతోపాటు అత్యవసరమైన వారికి నాణ్యమైన ఆరోగ్య రక్షణ అందుబాటులో ఉండేలా చూస్తూ, మొత్తం సామాజిక భద్రత వ్యవస్థను గణనీయంగా మెరుగుపరుస్తుందని భావిస్తున్నారు.

బాల కార్మికుల ఆచూకీని కనిపెట్టే వ్యవస్థ

న్యూఢిల్లీ, నవంబర్ 29:ప్రభుత్వం 'ప్లాట్‌ఫార్మ్ ఫర్ ఎఫెక్టివ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఫర్ నో చైల్డ్ లేబర్ (పీఈఎన్‌సీఐఎల్)' పేరుతో ఒక ఆన్‌లైన్ పోర్టల్‌ను రూపొందించింది. బాలలు, కౌమార దశలో ఉన్న కార్మికుల (నిషేధం, నియంత్రణ) చట్టం-1986లోని నియమ నిబంధనలు అమలు చేయడానికి ఈ చర్య తీసుకున్నారు. ఈ పోర్టల్‌లో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా ప్రాజెక్టు సొసైటీలు, చైల్డ్ ట్రాకింగ్ సిస్టమ్, ఫిర్యాదులు.. అని అయిదు విభాగాలున్నాయి.

చట్ట నిబంధనావళిని కచ్చితంగా అమలు చేయడం కోసం డిస్ట్రిక్ట్ నోడల్ ఆఫీసర్లను (డీఎన్ఓస్) నియమించారు.

వలస కార్మికులు, బాలికలు, ఎస్‌సీ/ఎస్‌టీ బాలలు సహా బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని చర్యలు తీసుకోవాలని కోరుతూ ఒక ఆదర్శ రాష్ట్ర కార్యాచరణ ప్రణాళికను (ఎస్ఏపీ) కూడా కార్మిక ఉపాధి మంత్రిత్వ శాఖ రూపొందించింది.

ఈ వివరాలను కేంద్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ సహాయ మంత్రి శోభ కరంద్‌లాజే ఈ రోజు రాజ్యసభలో తెలియజేశారు.

పీకేయడానికి కేసీఆర్ మొక్కకాదు వటవృక్షం - జీవన్ రెడ్డి

నిజామాబాద్, నవంబర్ 29:తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ చెట్టుకు తల్లి వేరు లాంటివారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి అన్నారు. నిజామాబాద్ నగరంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం తెలంగాణ భవన్ లో శుక్రవారం పెద్ద ఎత్తున నిర్వహించిన 'దీక్షాదివస్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎవడో వచ్చి పీకేయడానికి కేసీఆర్ మొక్కకాదని, వటవృక్షమని స్పష్టం చేశారు. కేసీఆర్ ను ఏదో పీకుతామని శపథాలు చేసిన వైఎస్ , చంద్రబాబు, కిరణ్ కుమార్ రెడ్డి వంటి వారి జెండాలు పీక్కోని పోయారు. తెలంగాణ, కేసీఆర్ ను వేర్వేరుగా చూడలేమన్నారు.

జై తెలంగాణ నినాదాల హోరుతో నమరోత్సవంతో నిర్వహించిన 'దీక్షాదివస్' కార్యక్రమంలో గులాబీ శ్రేణులు వెల్లువలా తరలి వచ్చారు. దీక్ష దివాస్ సందర్భంగా వినాయక్ నగర్ లో గల అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ముందుగా, బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేశారు. అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. దీక్షాదివస్ కర్మ, కర్త, క్రియ అయిన తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం, ఫోటో ఎగ్జిబిషన్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి,దీక్షా దీవాన్ ఇంచార్జ్ ఫారూఖ్ హుస్సేన్,మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేష్ గుప్తా,బాజిరెడ్డి గోవర్ధన్,బోధన్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆయేషా ఫాతిమా షకీల్,మాజీ జడ్పి చైర్మన్ విఠల్ రావు,సీనియర్ నాయకులు రాంకిషన్ రావు,రాజారాం యాదవ్,అలీం,బాజిరెడ్డి జగన్, బీఆర్ఎన్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమ కారులు,యువకులు తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు, హైకోర్టుల విచారణలు, తీర్పుల అనువాదం, ప్రచురణకు చర్యలు

న్యూఢిల్లీ, నవంబర్ 29:న్యాయపరమైన పత్రాల అనువాదంలో కృత్రిమ మేధ (ఏఐ) భాషా సాంకేతికత వినియోగాన్ని భారత సర్వోన్నత న్యాయస్థానం ఆమోదించింది. 2023 ఫిబ్రవరి నుంచి జరిగిన మౌఖిక వాదనల భాషాంతరీకరణలో, ముఖ్యంగా రాజ్యాంగ ధర్మాసనాల విషయంలోనూ కృత్రిమ మేధను వినియోగించారు. ముఖ్యమైన సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పుల స్థానిక భాషా అనువాదాన్ని పర్యవేక్షించడానికి గౌరవ సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ఓ కమిటీని నియమించారు. ఈ కమిటీ అనువాద ప్రక్రియను వేగవంతం చేయడం కోసం గౌరవ న్యాయమూర్తులతో కూడిన హైకోర్టు ఉప కమిటీలతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తోంది.

సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పుల స్థానిక భాషా అనువాదానికి సంబంధించిన మొత్తం పనిని హైకోర్టుల కృత్రిమ మేధ అనువాద కమిటీలు పర్యవేక్షిస్తున్నాయి. 17 హైకోర్టులు ఇ-హైకోర్టు రిపోర్ట్స్ (ఇ-హెచ్ సీఆర్)/ ఇ-ఇండియన్ లా రిపోర్ట్స్ (ఇ-ఐఎల్ఆర్)ను ఇప్పటికే ప్రారంభించాయి.అన్ని కేంద్ర, రాష్ట్ర శాసనాలు, నియమ నిబంధనలు, మొదలైన అంశాలను స్థానిక భాషల్లోకి అనువదించవలసిందిగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను కోరాలని హైకోర్టుల కృత్రిమ మేధ అనువాద కమిటీలకు సూచనలు అందాయి. రాష్ట్ర వెబ్ సైట్లలో అందుబాటులో ఉంచడం ద్వారా సాధారణ ప్రజలు వాటిని తమ భాషలోనే చదువుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది. భారత రాజ్యాంగం ప్రకారం ఇది 'న్యాయాన్ని అందరికీ చేరువ చేయడం'లో భాగంగా ఉన్నందున.. తీర్పుల అనువాదంలో తమ హైకోర్టులకు పూర్తి సహకారం అందించాల్సిన బాధ్యత ఆయా రాష్ట్ర ప్రభుత్వాలపై కూడా ఉంది.

నవంబరు 25 నాటికి 36,316 సుప్రీంకోర్టు తీర్పులను హిందీలోకి అనువదించారు. 42,457 సుప్రీం కోర్టు తీర్పులను ఇతర 17 ప్రాంతీయ భాషల్లోకి అనువదించారు. అవి ఇ-ఎస్సీఆర్ పోర్టల్ లో అందుబాటులో ఉన్నాయి.

ఈ అనువాద ప్రాజెక్టు కోసం సుప్రీం కోర్టుకు ప్రత్యేకమైన నిధులు మంజూరు చేయలేదు.

న్యాయ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా) శ్రీ అర్జున్ రాం మేఘ్వాల్ రాజ్యసభకిచ్చిన ఓ లిఖిత పూర్వక సమాధానంలో ఈ సమాచారం అందించారు.

బండల ట్రాక్టర్ బోల్తా.. ఒకరు మృతి

బండల ట్రాక్టర్ టైర్ పేలి ఒకరు మృతిచెందిన ఘటన కర్నూలు జిల్లా వెల్దుర్తి సమీపంలోని నక్కల మిట్ట దగ్గర రహదారిలో జరిగింది. ఓర్వకల్ నుంచి వెల్దుర్తి పట్టణానికి నాప బండల లోడుతో తెల్లవారు జామున వస్తున్న ట్రాక్టర్ టైర్ పేలి మల్లికార్జున (25) అనే వ్యక్తి మృతిచెందాడు.

మరో ఇద్దరు నాగేశ్వరరావు, కృష్ణలు గాయపడ్డారు. గాయపడిన వారిని 108 అంబులెన్స్ లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వెల్దుర్తి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు.

శరణార్థిగా గుర్తించండి.. అమెరికా ప్రభుత్వానికి ప్రభాకరరావు పిటిషన్

హైదరాబాద్, నవంబర్ 29: ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు కొత్త మలుపు తిరిగింది. కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు తెలంగాణ ప్రభుత్వానికి షాకిచ్చారు. ప్రస్తుతం ప్రభాకర్‌రావు అమెరికాలో ఉన్న విషయం తెలిసిందే. తనను రాజకీయ శరణార్థిగా గుర్తించాలని అమెరికా ప్రభుత్వానికి ప్రభాకర్ రావు తాజాగా పిటిషన్ పెట్టుకున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో తెలంగాణ ప్రభుత్వం తనను ఇబ్బంది పెడుతోందని పిటిషన్‌లో ప్రభాకర్‌రావు పేర్కొన్నారు.తెలంగాణ ప్రభుత్వంలో తాను కీలక స్థానంలో పనిచేశానని తెలిపారు. రాజకీయంగా తనను వేధిస్తున్నారని ఆరోపించారు. తాను తీవ్ర అనారోగ్య సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నానని ప్రభాకర్‌రావు పేర్కొన్నారు.ప్రస్తుతం తాను ఫ్లోరిడాలోని కుమారుని వద్ద ఉంటున్నానని తెలిపారు.కాగా,మరో వైపు అమెరికాలో తలదాచుకుంటున్న ప్రభాకర్ రావును ఇండియాకు రప్పించేందుకు తెలంగాణ పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు.ఇంటర్ పోల్ ద్వారా ప్రభాకర్‌రావుకు రెడ్ కార్నర్ నోటీసు జారీ చేయించేందుకు పోలీసులు గట్టిగా ప్రయత్నిస్తున్నారు.ఈ కేసులో మరో నిందితుడు, టీవీఛానల్ ఎండి శ్రవణ్ రావు అమెరికాలోని చికాగోలో ఉంటున్నట్లు పోలీసులు కనిపెట్టారు.

వాడ వాడలా దీక్షా దివస్.. కెసిఆర్ దీక్షకు 15 ఏళ్లు

-ఆనాటి దీక్షను గుర్తు చేస్తుకున్న గులాబీ శ్రేణులు

-కెసిఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేసిన కెటిఆర్

-సిద్దిపేటలో అమరవీరులకు నివాళులర్పించిన హరీశ్ రావు

హైదరాబాద్, నవంబర్ 29: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు దిగి నేటితో 15 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా

దీక్షా దివస్ జరుపుకుంటున్నారు ఈ సందర్భంగా అన్ని జిల్లా కేంద్రాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ర్యాలీలు, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయి.

కరీనగర్ లోని తెలంగాణ భవన్ లో జరిగిన కార్యక్రమానికి ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ హాజరయ్యారు.. ముందుగా ఆయన ఎల్ఎండి వద్ద కేటీఆర్ అమరవీరుల స్థూపానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు. అనంతరం బిఆర్ఎస్ శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కెసిఆర్ చిత్రపటానికి కెటిఆర్ పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గంగుల కమలాకర్, మండల వైస్ చైర్మన్ బండ ప్రకాష్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, మాజీ సుడా చైర్మన్ జీవి రామకృష్ణారావు, మాజీ మేయర్ రవీందర్ సింగ్ తో పాటు పెద్ద సంఖ్యలో బిఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిద్ధిపేటలో మాజీ మంత్రి హరీష్‌రావు తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని రంగదాంపల్లిలో అమరులవీరుల స్థూపం దగ్గర అంజలి ఘటించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లాలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో దీక్షా దివస్ నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లాలో జరుగుతున్న దీక్షా దివస్ కార్యక్రమంలో మాజీ మంత్రి జోగు రామన్న, ఎమ్మెల్యే అనిల్ యాదవ్, జిల్లా బీఆర్ఎస్ ఇన్‌చార్జి గంగాధర్ గౌడ్ పాల్గొన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ఆధ్వర్యంలో దీక్షా దివస్ జరిపారు. వరంగల్‌లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆధ్వర్యంలో దీక్షా దివస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

నారాయణపేట జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్‌లో దీక్షా దివస్ జరుపుకుంటున్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మంకెన కొటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి, మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. నల్లగొండ జిల్లా క్లాక్ టవర్ సెంటర్‌లో జిల్లా ఇన్‌చార్జి మన్నెం శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో దీక్షా దివస్ కార్యక్రమం జరిగింది

మహబూబాబాద్ జిల్లాలో మాజీ మంత్రి రెడ్యానాయక్, మాజీ ఎంపీ మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ తదితరులు దీక్షా దివస్‌లో పాల్గొన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ షేరి సుభాష్ రెడ్డి, ఇతర నేతలు దీక్షా దివస్ నిర్వహించారు. ములుగు జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ భవన్ వద్ద కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మాజీ ఎమ్మెల్యే గండ్ర ఆధ్వర్యంలో దీక్షా దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మెదక్‌లో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డిల ఆధ్వర్యంలో దీక్షా దివస్ వేడుకలు జరిగాయి. జనగామ జిల్లాలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో దీక్షా దివస్ నిర్వహించారు. ఇక నల్గొండ, సూర్యాపేటలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు..

జూన్ నాటికి ఎ.కొండూరుకు సురక్షిత కృష్ణా జలాలు.. కలెక్టర్ డా.లక్ష్మీశ

అమరావతి, నవంబర్ 28:ఎ.కొండూరు మండలంలోని కిడ్నీ వ్యాధుల ప్రభావిత 38గ్రామాల ప్రజలకు శాశ్వత ప్రాతిపదికన సురక్షిత కృష్ణా జలాలను రానున్న జూన్ నాటికి అందించేలా తాగునీటి సరఫరా ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. కిడ్నీ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు వ్యాధుల బారిన పడిన బాధితులకు ప్రత్యేక వైద్య సహాయం అందించి ప్రభుత్వ పరంగా అన్ని విధాలా ఆదుకుంటున్నామని తెలిపారు. ఎ.కొండూరు, పరిసర ప్రాంతాల్లో కిడ్నీ వ్యాధులను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.50 కోట్లతో రెడ్డిగూడెం మండలం కుదప వద్ద జరుగుతున్న రక్షిత తాగునీటి రిజర్వాయర్, పైపులైన్ల పనులను శుక్రవారం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశా అధికారులతో కలిసి పరిశీలించారు.

పనుల ప్రగతిపై అధికారులకు సూచనలు చేసి, అనంతరం ఎ.కొండూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, మినీ డయాలసిస్ కేంద్రాన్ని సందర్శించి, రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కిడ్నీ వ్యాధుల ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు సురక్షితమైన కృష్ణా జలాలను అందించేందుకు రెడ్డిగూడెం మండలం, కుదప గ్రామం వద్ద నిర్మిస్తున్న ఓవర్ హెడ్ రిజర్వాయర్ పనులు పూర్తిచేయడం జరిగిందని.. ఇందుకు సంబంధించి దాదాపు 200కి.మీ. మేర పైపులైన్ల పనులలో ఇప్పటికే 90 కి.మీ. మేర పూర్తయ్యాయని, మరో 22 కి.మీ. పనులు తది దశకు చేరుకున్నాయని వివరించారు.

ఎ.కొండూరు మండలంలోని 38 గ్రామాల్లో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులకు అదనంగా మరో 14 ట్యాంకులు నిర్మిస్తున్నామని తెలిపారు. ఆయా పనులను మరింత వేగవంతం చేసి నిర్దేశించిన లక్ష్యంలోపు పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీచేశామన్నారు. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తొలి పర్యటనగా రెడ్డిగూడెం, ఎ.కొండూరు మండలాల్లో పర్యటించి నిరుపేదలైన తండావాసుల స్థితిగతులను పరిశీలించి, వారికి మరింత మెరుగైన సహకారాన్ని అందించాలనే ఆలోచన చేస్తున్నామన్నారు.

స్థానిక శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం ఏర్పాటుచేసిన మినీ డయాలసిస్ కేంద్రాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించి బాధితులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సంతృప్తికరమైన వైద్య సహాయం అందించేందుకు కృషిచేయాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించామన్నారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందించే సేవలు సంతృప్తికరంగానే ఉన్నాయని మరింత మెరుగైన సేవలందించేలా ఆరోగ్య కేంద్రంలో అవసరమైన మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎ.కొండూరు, రెడ్డిగూడెం, తిరువూరు ప్రాంతాల్లో పనిచేస్తున్న ప్రభుత్వాధికారులు, సిబ్బంది అంకితభావంతో పారదర్శకమైన సేవలందించి నిరుపేదల జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కలెక్టర్ వెంట స్థానిక ఆర్‌డీవో కె.మాధురి, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ విద్యాసాగర్, డీపీవో పి.లావణ్య కుమారి, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు.

రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం.. అంజయ్య

వరంగల్, నవంబర్ 29:రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వాజేడు సహకార సంఘ అధ్యక్షులు అంజయ్య అన్నారు. ప్రజా విజయోత్సవాల సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సంవత్సర కాలంలోనే రెండు లక్షల రూపు రుణమాఫీ చేయడం జరిగిందని, రాష్ట్ర వ్యాప్తంగా 18వేల కోట్ల రూపాయలు రుణమాఫీ చేసి రైతులను ఆదుకున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ మేనని ఆయన అన్నారు.

కొన్ని కారణాల వలన కొంతవందికి రుణమాఫీ కాలేదని వారికి కూడా డిసెంబర్ 9 వరకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేస్తుందన్నారు. అదేవిధంగా రైతు పండించిన వరి ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించడమే కాక సన్న రకం ధాన్యానికి 500 రూపాయలు బోనస్ ఇవ్వడం కూడా జరుగుతుందన్నారు. దళారులను ఆశ్రయించి మోసపోకుండా రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి అధిక లాభాలను పొందడమే కాక బోనస్ కూడా పొందాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షులు వత్తవాయి జగన్నాథరాజు కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ సొసైటీ సీఈవో సోమ సత్య నారాయణ ఏఈఓ జాఫర్ రికార్డర్ అసిస్టెంట్ వడ్లూరి వరప్రసాద్ కాంగ్రెస్ నాయకులు చెన్నై ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

డివైడర్ ఎక్కిన ఆర్టీసీ బస్సు.. తప్పిన ప్రమాదం

-స్వల్ప గాయాలతో బయటపడిన ప్రయాణికులు

మెదక్, నవంబర్ 29: అందోల్ మండల పరిధిలోని కన్ సానిపల్లి జాతీయ రహదారిపై శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. నారాయణఖేడ్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో నారాయణఖేడ్ నుంచి సంగారెడ్డి వైపు వస్తున్న క్రమంలో కన్ సానిపల్లి వద్దకు రాగానే అదుపుతప్పి జాతీయ రహదారిపై ఉన్న డివైడర్ పైకి దూసుకెళ్లింది.

డివైడర్ పైన కాస్త బస్సు ముందుకు వెళ్ళింది. బస్సులో అప్పటికే 50మందికి పైగా ప్రయా ణికులు బస్సులో ప్రయాణి స్తున్నారు. జరిగిన ప్రమాదంలో సుమారు 20మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలు కాగా, మిగతా ప్రయాణి కులు సురుక్షితంగా బయట పడ్డారు.

గాయాలైన ప్రయాణికులను వెంటనే చికిత్స నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆర్టీసీ డ్రైవర్ అజాగ్రత్తగా, అతివేగంగా బస్సును నడపడం వలనే ఈ ప్రమాదం చోటుచేసుకుందని ప్రయాణికులు అన్నారు.

కన్ సానిపల్లి వద్ద జరిగిన ప్రమాదం తెలుసుకున్న జోగిపేట ఎస్ఐ పి.పాండు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ప్రమాదంలో గాయాలై చికిత్స పొందుతున్న ప్రయాణికుల వివరాలు వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో బస్సు ప్రమాదంలో గాయాలైన ప్రయాణికులకు మెరుగైన వైద్యులు వైద్య చికిత్సలు అందిస్తున్నారు.

పూలే జీవితం నేటికీ సమాజ స్ఫూర్తికి ఆదర్శం

-డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు

హైదరాబాద్ నవంబర్ 28 (ఎక్స్ ప్రెస్ న్యూస్);సమాజం



పటిష్టంగా ఉండాలంటే ప్రతి వ్యక్తికి విద్య అనేది ప్రాథమిక హక్కుగా ఉండాలని పోరాడిన సమసమాజ దార్శనికుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని తెలంగాణ బీసీ కమిషన్ పూర్వ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు అన్నారు.సమాజంలో అసమానతలను భరించడం కాదు వాటిని ఎదురించి నిర్మూలించాలని పోరుబాట పట్టాలని బోధించిన సామాజిక పరివర్తకుడు మహాత్మా పూలే అని వకుళాభరణం పేర్కొన్నారు.గురువారం నాడు 135వ హాత్మా పూలే 135వ వర్ధంతి సందర్భంగా అంబర్పేట్ ఆలీ కేఫ్ చౌరస్తా వద్దగల మహాత్మా పూలే విగ్రహానికి పూలమాలవేసి ఆయన ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన సభలో మాట్లాడుతూ..కుల వివక్షతను బహిరంగంగానే వ్యతిరేకించి దాని నిర్మూలనకు భారత సమాజంలో వెలుగులు ప్రసరించేలా చేసిన మహనీయుడు పూలే అని ఆయన అన్నారు. స్త్రీ విద్య ద్వారా సమాజ అభివృద్ధికి బలమైన పునాది వేశారు అన్నారు. సమాజంలో అన్యాయాలను ప్రశ్నించడమే కాదు నిర్మూలన కూడా ఆయన జీవితాంతం కృషి చేశారు అని అన్నారు.కుల వివక్ష నుండి ప్రజలకు విముక్తి లభించాలని, సామాజిక అసమానతలను ఎప్పటికప్పుడు బహిరంగంగా ఎత్తిచూపారు ప్రజలను చైతన్యవంతులను చేశారు ఆయన కేవలం విమర్శలకు మాత్రమే పరిమితం కాకుండా వివక్ష నిర్మూలనకు నిర్మాణాత్మకమైన ప్రతిపాదనలను చేశారు. పూలే సత్యశోధక సమాజ్ పీడిత వర్గాలకు గొంతుగా నిలబడింది ఆయన ఆశయాలు ప్రగతిశీల సమాజ నిర్మాణానికి కీలక అడుగులుగా పడ్డాయి. సమాజ శ్రేయస్సు అంటే అందరికీ సమాన హక్కులు లభించాలని పూలే పోరాడారు అని అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎస్సీ , ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు డిక్లరేషన్ల పేరిట ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకొని ఫలితాలు అందించినప్పుడే మహాత్మా పూలేకు ఘనమైన నివాళి అని డాక్టర్ వకుళాభరణం అభిప్రాయపడ్డారు.

చంద్రబాబు నాయుడు బెయిల్ వినతిపై విచారణ వాయిదా!

న్యూఢిల్లీ నవంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణం కేసులో ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడుకు బెయిల్ మంజూరుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌పై విచారణను శుక్రవారం సుప్రీంకోర్టు జనవరి 2025కి వాయిదా వేసింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాయిదా వేయాలని కోరడంతో న్యాయమూర్తులు బేల ఎం త్రివేది , ఎస్‌సి శర్మతో కూడిన ధర్మాసనం కేసును వాయిదా వేసింది.''వదేవదే వాయిదా వేయడంలో పాయింట్ అన్నదే లేదు. చివరి అవకాశంగా జనవరి రెండో వారానికి వాయిదా వేస్తున్నాం" అని ధర్మాసనం తెలిపింది. చంద్రబాబు నాయుడు చాలా ప్రభావశాలి వ్యక్తి అని, ఆయన ఇద్దరు కీలక సహచరులు దేశం వదిలిపెట్టి వెళ్లిపోయారని, కనుక ఆయన బెయిల్ ను వక్కన పెట్టాలని కోరడం జరిగింది. నిందితుడు దర్యాప్తుకు అడ్డంకులు కల్పిస్తున్నారని, కనుక ఆయనకు బెయిల్ ఇవ్వరాదని వినతిలో కోరడం జరిగింది.

పీకేయడానికి కేసీఆర్ మొక్కకాదు వటావృక్షం- జీవన్ రెడ్డి

నిజామాబాద్, నవంబర్ 29: తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ చెట్టుకు తల్లి వేరు లాంటివారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి అన్నారు. నిజామాబాద్ నగరంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం తెలంగాణ భవన్ లో శుక్రవారం పెద్ద ఎత్తున నిర్వహించిన 'దీక్షాదివస్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎవడో వచ్చి పీకేయడానికి కేసీఆర్ మొక్కకాదని, వటావృక్షమని స్పష్టం చేశారు. కేసీఆర్ ను ఏదో పీకుతామని శపథాలు చేసిన వైఎస్ , చంద్రబాబు, కిరణ్ కుమార్ రెడ్డి వంటి వారి జెండాలు పీక్కోని పోయారు. తెలం గాణ, కేసీఆర్ ను వేర్వేరుగా చూడలేమన్నారు.

జై తెలంగాణ నినాదాల హోరుతో సమరోత్సవంతో నిర్వహించిన 'దీక్షాదివస్' కార్యక్రమంలో గులాబీ శ్రేణులు వెల్లువలా తరలి వచ్చారు. దీక్ష దివాస్ సందర్భంగా వినాయక్ నగర్ లో గల అమరవీరుల స్తూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ముందుగా, బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేశారు. అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. దీక్షాదివస్ కర్త, కర్త, క్రియ అయిన తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం, ఫోటో ఎగ్జిబిషన్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి,దీక్షా దీవాన్ ఇంచార్జ్ ఫారూఖ్ హుస్సేన్,మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేష్ గుప్తా,బాజిరెడ్డి గోవర్ధన్,బోధన్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆయేషా ఫాతిమా షకీల్,మాజీ జడ్పి ఛైర్మన్ విఠల్ రావు,సీనియర్ నాయకులు రాంకిషన్ రావు,రాజారాం యాదవ్,అలీం,బాజిరెడ్డి జగన్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమ కారులు,యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వేళ మద్యం పార్టీ .. ఉద్యోగ సంఘ నేత వెంకట్రామిరెడ్డిపై కేసు నమోదు

అమరావతి, నవంబర్ 28:అనుమతి లేకుండా మద్యం పార్టీ నిర్వహిస్తున్న ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డిపై ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం? గుంటూరు జిల్లా తాడేపల్లిలోని విజయవాడ క్లబ్ పక్కనే ఉన్న కొండపాకలూరు గార్డెన్స్‌లో అనుమతి లేకుండా మద్యం పార్టీ నిర్వహిస్తున్నారనే సమాచారంతో గురువారం అర్ధరాత్రి ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు.

అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు మారయ్యబాబు, సూర్యనారాయణ నేతృత్వంలో సీఐలు వీరాంజనేయులు, నయనతార, రమేష్‌తోపాటు 20 మంది సిబ్బంది తనిఖీలు చేశారు. సచివాలయ ఉద్యోగుల నాయకుడు వెంకట్రామిరెడ్డి ఈ పార్టీ నిర్వహిస్తున్నట్లు గుర్తించి అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

డిసెంబరు 4న సచివాలయ ఉద్యోగుల అసోసియేషన్ ఎన్నికల నిర్వహించనున్న నేపథ్యంలో ఈ పార్టీని ఏర్పాటు చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఎక్సైజ్ శాఖ నుంచి ఎటువంటి అనుమతీ తీసుకోకుండా పార్టీ నిర్వహించి, నిబంధనలను అతిక్రమించినట్లు నిర్వాహకుడు వెంకట్రామిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ పోలీసులు పేర్కొన్నారు. వీరి వద్ద నుంచి ఏడు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

తరగతి గదిలో పంతులమ్మపై ప్రదానోపాధ్యాయుడు కాల్పులు

రాంఛీ నవంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : ఇద్దరు ఉపాధ్యాయుల మధ్య గొడవలు చవరికి కాల్పుల వరకు దారి తీసింది. తరగతి గదిలో పాఠాలు చెబుతుండగా ప్రధానోపాధ్యాయురాలిపై ఉపాధ్యాయుడు గన్‌తో కాల్చిన సంఘటన ఝార్ఖండ్ రాష్ట్రం ఢియోగఢ్ జిల్లాలో జరిగింది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం? మోహన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చితర్ పోకా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చాందినీ కుమారీ హెడ్‌మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అదే పాఠశాలలో శైలేష్ యాద్ అసిస్టెంట్ టీచర్‌గా పని చేస్తున్నారు. చాందినీ కుమార్ తరగతి గదిలో పాఠాలు చెబుతుండగా ఆమెపై శైలేష్ కాల్పులు జరిపాడు. కాల్పుల్లో తీవ్రంగా గాయపడడంతో ఆస్పత్రికి తరలించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, చేతుల బుల్లెట్లు దిగినట్టు వైద్యులు వెల్లడించారు. ఇద్దరు మధ్య గత కొన్ని రోజుల నుంచి గొడవలు జరుగుతున్నట్టు సమాచారం. ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

కాగజ్‌నగర్ మండలం లో పులి దాడి యువతి మృతి

కాగజ్‌నగర్ నవంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పులి దాడి చేయడంతో యువతి మృతి చెందింది. కాగజ్‌నగర్ మండలం గన్నారం గ్రామ శివారులో మోర్లె లక్ష్మి అనే యువతిపై పులి దాడి చేయడంతో మృతి చెందింది. యువతిని శరీర భాగాలను పులి పీక్కు తిన్నది. మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులు, అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీ శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని పులి దాడిలో యువతి చనిపోయిందిని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. పులి అతి త్వరంలో పట్టుకుంటామని అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఒంటరిగా అడవిలో వెళ్లవద్దని అధికారులు స్థానికులకు తెలియజేశారు. పులుల నుంచి తమకు రక్షణ కల్పించాలని కాగజ్‌నగర్‌లోని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సరైన సాక్ష్యాధారాలు లేనందున రిషితేశ్వరి కేసును కొట్టేసిన గుంటూరు కోర్టు

గుంటూరు నవంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్);తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన రిషితేశ్వరి ఆత్మహత్య కేసును గుంటూరు కోర్టు కొట్టేసింది. సరైన సాక్ష్యాధారాలు లేనందున ఈ నిర్ణయం తీసుకుంటున్నామని తుది తీర్పు వెలువరించింది.రిషితేశ్వరి స్వస్థలం తెలంగాణలోని వరంగల్. నాగార్జున యూనివర్సిటీలోని ఆర్కిటెక్చర్ కోర్సులో చేరింది. అయితే 2015 జూలై 14వ తేదీన రిషితేశ్వరి అనుమానాస్పదంగా మృతి చెందిన కనిపించింది. ఆమె మృతదేహం దగ్గర ఓ సూసైడ్ నోట్ కూడా దొరికింది. ర్యాగింగ్ కారణంగానే ఆత్మహత్య చేసుకుంటున్నట్లుగా సూసైడ్ నోట్‌లో కూడా పేర్కొంది. సీనియర్ విద్యార్థుల వేధింపులు తట్టుకోలేకపోతున్నానని ఆ లేఖలో తెలిపింది. దీంతో ఈ ఉదంతం అప్పట్లో సంచలనంగా మారింది. గుంటూరు కోర్టులో తొమ్మిదేళ్ల పాటు ఈ కేసుపై విచారణ జరిగింది. చివరకు ప్రాసిక్యూషన్ నేరం నిరూపించలేకపోవడంతో న్యాయసానం ఈ కేసును కొట్టివేసింది .రిషితేశ్వరి కేసులో అప్పీల్‌కు వెళ్లాలని నిర్ణయించినట్లు పీపీ వైకే తెలిపారు. ఆత్మహత్యకు ప్రేరేపించిన వారి పేర్లు డైరీలో ఉన్నాయని పేర్కొన్నారు. తనను ఏ విధంగా వేధించారో ఆ డైరీలో ఉందన్నారు. సీనియర్లు ఎలా వేధించారో డైరీలో స్పష్టంగా రాసి ఉందని చెప్పారు. ఫిర్యాదు చేసినా ప్రిన్సిపాల్ బాబురావు పట్టించుకోలేదన్నారు. ఫ్రెషర్స్ పార్టీలో లైంగికంగా వేధించారని చెప్పారు. గుంటూరు కోర్టు ఇచ్చిన తీర్పు న్యాయమైనది కాదని భావిస్తున్నామన్నారు.గుంటూరు తీర్పుపై రిషితేశ్వరి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తొమ్మిదేళ్లుగా పోరాడుతున్నామని.. ఇక ఓపిక లేదని రిషితేశ్వరి తల్లి తెలిపారు. న్యాయం జరుగుతుందని భావించామన్నారు. డైరీని ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదో తెలియడం లేదని చెప్పారు. డైరీలో అన్ని వివరాలు ఉన్నాయన్నారు. ఈ కేసులో 170 మంది సాక్ష్యులు ఉన్నారని.. తమ కూతురు రాసిన లేఖ కూడా ఉందని.. వాటిని ఈ కేసులో ఎందుకు సాక్ష్యాలుగా పరిగణించలేదో అర్థం అవ్వడం లేదని కన్నీళ్లు పెట్టుకున్నారు. తమ బిడ్డకు జరిగిన అన్యాయంపై ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలుస్తామని తెలిపారు. కోర్టులకు వెళ్లే ఆర్థిక స్తోమత తమకు లేదని.. ప్రభుత్వమే తమకు సాయం అందించాలని కోరారు.

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే ఈ ఇన్స్ పైర్ వైజ్ఞానిక ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

-విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే ఈ ఇన్స్ పైర్ వైజ్ఞానిక ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

- అంశాలలో విద్యార్థినీవిద్యార్థులు ఉత్సాహంగా వారి నైపుణ్యాలను కనబరిచారు.జిల్లాస్థాయి ఇన్స్ పైర్ వైజ్ఞానిక ప్రదర్శన-2024 అట్టహాసంగా నిర్వహణ మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్

మెదక్, నవంబర్ 29: రాజ్‌మెదక్ పట్టణంలో వెస్లీ పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జిల్లాస్థాయి ఇన్స్ పైర్ వైజ్ఞానిక ప్రదర్శన-2024 వైజ్ఞానిక ప్రదర్శన అట్టహాసంగా ప్రారంభమైంది.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ , సంబంధిత ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఇన్స్ పైర్ వైజ్ఞానిక ప్ర జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతంగా చదువుకొని శ్రాస్తవేత్తలుగా ఎదగాలని కలెక్టర్ అన్నారు. విద్యార్థులు సైన్స్, గణితాన్ని ఇష్టపడి చదివి గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. సమస్యకు పరిషారం చూపడానికి, నూతన ఆవిష్కరణలకు సైన్స్, గణితము దోహదపడుతాయన్నారు.ఇన్స్ పైర్ వైజ్ఞానిక విద్యార్థులు ప్రదర్శనలో చూపించిన అంశాలను వాటిని ప్రయోగాత్మకంగా అమలు చేసినప్పుడే ఫలితాలు ఉంటాయన్నారు. విద్యార్థినీ విద్యార్థులకు సెల్ఫ్ కాన్ఫిడెన్స్ తో పాటు విజ్ఞానాన్ని పెంపొందించాలని చెప్పారు. ఆహారం ఆరోగ్యం వరిశుభ్రత-53 సహజ వ్యవసాయం-42, రవాణా కమ్యూనికేషన్-70, విపత్తుల నిర్వహణ-43, వృర్థాల నిర్వహణ-45, గణిత నమూనా-48, ఇన్స్ పైర్ -36337 అంశాలలో విద్యార్థినీ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారునేటి బాలలే భావిభారత శాస్త్రవేత్తలని,అదిశగా విద్యార్థుల ఆలోచనలు ఉండేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలని టీచర్స్ ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి అన్నారు.విద్యార్థి దశ ఎంతో కీలకమైందన్నారు.సమాజానికి ఉపయోగపడే ఎగ్జిబిట్స్ ప్రదర్శించాలన్నారు.అంతకముందు కలెక్టర్ వైజ్ఞానిక ప్రదర్శనలో పిల్లలు ప్రదర్శించిన అంశాలను పరిశీలించి వారిని అభినందించారు.ఈ కార్యక్రమంలో. ఎమ్మెల్సీ రగొత్తం రెడ్డి,గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుమల సుహాసిని రెడ్డి , జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకృష్ణ, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన్ మూర్తి, ఎంఈఓ నీలకంఠం, జిల్లాస్థాయి వివిధ ఉపాధ్యాయ అధ్యక్ష, ప్రధాన కోశాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ధనమ్మ పార్థివదేహానికి నివాళులర్పించిన పరికపల్లి

ఖమ్మం, నవంబర్ 29: (నేటినిజం ప్రతినిధి): కొనిజర్ల మండలం పెద్దమునగాల శతాధిక వృద్ధురాలు మరికంటి దనమ్మ 112సం:లు గుండె పోటుతో మృతి చెందింది. ఆమె పార్థివదేహానికి నివాళులు అర్పించిన సీనియర్ నాయకులు పరికపల్లి బిక్షం, జిల్లా కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్ పరికపల్లి శ్రీనివాస్ ఈ సనదర్భంగా ఆయన మాట్లాడుతూ...దనమ్మ భక్తి భావాలతో ఎన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాలు సేవా కార్యక్రమాలు నిర్వహించారని గ్రామంలో అందరికీ అమ్మలా అందరిని ప్రేమగా చూసుకునే వారని కార్తిక శుక్రవారం మృతి చెందడం ఆమె అదృష్టమని ఆ భగవంతుడు స్వర్గానికి తీసుకుపోయారని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మరికంటి ఎల్లయ్య, గణేష్, బంటు లాలయ్య, బంటు యలాద్రి, రొంటే కృష్ణయ్య, బాలకోటి, దాడె పెద్ద పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

తలసాని, గంగులను పక్కన పెట్టుకొని దీక్షా దివాస్ చేసుకోవడానికి సిగ్గు ఉండాలి

- ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్

హైదరాబాద్ నవంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్)శ్రీ; తలసాని, గంగులను పక్కన పెట్టుకొని దీక్షా దివాస్ చేసుకోవడానికి సిగ్గు ఉండాలని,ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ విమర్శించారు. శుక్రవారం గాంధీ భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ తెలంగాణ వ్యతిరేకులను పక్కన పెట్టుకొని సంబరాలు చేసుకోవడం ఏంటో?అని ప్రశ్నించారు.రేవంత్ కాళ్ళు కడిగి కేటీఆర్ నెత్తిన నీళ్లను పోసుకోవాలన్నారు.బీఆర్ఎస్ నేతల జీవితమంతా అబద్ధాలేనిత్యం అసత్యాలు మాట్లాడే అసత్య రామారావుకేసీఆర్ లేకపోతే కేటీఆర్ ఎవరు?కేటీఆర్ స్థాయి ఎంత? బతుకెంత?కేటీఆర్ లాంటి కచర గాళ్ళకి మేం బయపడుతామా అని అన్నారు. కేటీఆర్ డ్రగ్స్ తీసుకోకుండా బయటకి వస్తాడా కేటీఆర్ అనుకోకుండా లీడర్ అయ్యాడు తెలంగాణలో కేటీఆర్ ఉండడు, వాళ్ళ పార్టీ ఉండదు పదేండ్లు బీఆర్ఎస్ ఏం పొడిచిందని ప్రస్నిన్చరె ఉ.విద్యార్థులను, రైతులను అరెస్టు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు.కేటీఆర్ ఖబర్దార్ రేవంత్ రెడ్డి పై ఇంకోసారి పిచ్చిపిచ్చిగా మాట్లాడితే రుకునేది లేదని హెచ్చరించారు.ఎవరు ఎవర్ని ఉరికిస్తారో చూసుకుందామా?మేం ఉరికిస్తే చెడ్డీలు కూడా మిగలకుండా ఉరికిస్తాం బీఆర్ఎస్ పేరు పెట్టుకున్న రోజే తెలంగాణతో మీకు పేగు బంధం తెగిపోయింది నోరు అదుపులో పెట్టుకోకపోతే కేటీఆర్ హైదరాబాద్లో తిరగలేడని హెచ్చరించారు.

మంత్రి కొండా సురేఖకు నాంపల్లి కోర్టు సమ్మన్లు

-డిసెంబర్ 12న కోర్టు ముందు హాజరు కావాలని ఆదేశం

హైదరాబాద్ నవంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: నటుడు నాగార్జున దాఖలు చేసిన పరువునష్టం కేసులో నాంపల్లి కోర్టు మంత్రి కొండా సురేఖకు గురువారం సమ్మన్లు జారీ చేసింది. కొండా సురేఖ అక్టోబర్ 3న నాగచైతన్య, సమంతకు విడాకులు ఇవ్వడానికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు కూడా కారణం అన్నారు. దీంతో నాగార్జున ఆమెపై క్రిమినల్ డిఫేమేషన్ కేసు వేశారు. మంత్రి చేసిన వ్యాఖ్యలు తమ కుటుంబ పరువు తీశాయని నటుడు నాగార్జున కోర్టుకు తెలుపుకున్నారు.''ఎన్ కన్వెన్షన్ కూల్చకుండా ఉండాలంటే సమంతను తన దగ్గరకు పంపాలని కెటిఆర్ కోరారని, దానివల్ల అతడే నాగచైతన్య, సమంత విడాకులకు కారణం. కెటిఆర్ వద్దకు వెళ్లాలని సమంతను నాగార్జున బలవంతపెట్టాడు. అందుకు ఆమె నిరాకరించింది. దాంతో వారు ఆమెను వెళ్లిపొమ్మన్నారు. ఈ కారణంగానే విడాకులు చోటుచేసుకున్నాయి" అని కొండా సురేఖ అన్నారు.

రెండో త్రైమాసికంలో 5.4 శాతానికి తగ్గిన జిడిపి

న్యూఢిల్లీ నవంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: భారత స్థూల జాతీయోత్పత్తి(జిడిపి) నెమ్మదించింది. 2024-25 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో 5.4 శాతానికి తగ్గిపోయింది. ప్రభుత్వం ఈ మేరకు డేటాను శుక్రవారం విడుదల చేసింది. 2023-24 రెండో త్రైమాసికంలో జిడిపి 8.1 శాతంగా ఉండింది. అది ఈసారి నెమ్మదించింది.ఇదే విధంగా రియల్ గ్రాస్ వాల్యూ యాడెడ్(జివిఏ) కూడా నెమ్మదించింది. 2023-24 రెండో త్రైమాసికంలో 7.7 శాతం ఉండగా, 2024-25 రెండో త్రైమాసికంలో 5.6 శాతానికి తగ్గిపోయింది.వ్యవసాయం, పశుసంపద, అడవులు,మత్స్య రంగం రెండింతల వృద్ధి సాధించినప్పటికీ తయారీ రంగం, గనుల శాఖ వృద్ధి కుంటుపడింది. తయారీ రంగం వృద్ధి 14.3 శాతం నుంచి 2.2 శాతానికి పడిపోయింది. ఇక గనులు, క్వారీ రంగాల వృద్ధి రేటు కూడా మైనస్ 0.1 శాతం నమోదయింది. ఇది అంతకు మునుపు సంవత్సరంలో 11.1 శాతంగా ఉండింది. విద్యుత్తు, గ్యాస్, నీటి సరఫరా, ఇతర వినియోగ సేవలు కూడా గణనీయంగా పడిపోయాయి.వినియోగంలో పెద్ద ఎత్తున తగ్గిపోవడం కనిపిస్తోంది. గతంలో 10.4 శాతం ఉంటే ఈ ఏడాది 3.3 శాతం మాత్రమే ఉంది.

ఏసీబీకి చిక్కిన ల్యాండ్ సర్వేర్ అధికారి..

ఆదిలాబాద్, నవంబర్ 29: నిర్మల్ జిల్లాలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. మామడ మండలంలోని కలెక్టర్ కార్యాలయ సముదాయంలో గల సర్వే ల్యాండ్ కార్యాలయంలో శుక్రవారం ఏసిబి అధికారులు దాడులు నిర్వహించారు.జిల్లా కేంద్రంలోని బుధావర్ పేట్‌కు చెందిన సల్లా హరీశ్‌కుమార్ కు భూమికి సంబంధించి సేత్వార్ ప్రతి, తోంచ్ చిత్రపటం జారీ చేసేందుకు అసిస్టెంట్ డైరెక్టర్ రూ.20 వేలు డిమాండ్ చేశారు. అయితే ఆ యువకుడు ఏసీబీ అధికారాలను ఆశ్రయి ంచారు. ఈ క్రమంలో ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళిక ప్రకారం అటెండర్ ప్రశాంత్, జూనియర్ అసిస్టెంట్ జగదీష్ లను రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి మాట్లాడుతూ.. ల్యాండ్ సేత్వార్ కోసం లంచం తీసుకుంటూ అటెండర్ ప్రశాంత్, జూనియర్ అసిస్టెంట్ జగదీష్ పట్టుబడ్డారని, వారిని కరీంనగర్ కోర్టులో హాజరుపరిచి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉచిత కరెంటు వస్త లేదు- సబ్సిడీ గ్యాస్ లేదు

–మంత్రి పొన్నంను ప్రశ్నించిన మహిళలు

కరీంనగర్, నవంబర్ 29: ఉచిత కరెంట్, గ్యాస్ సబ్సిడీ మా కుటుంబాలకు రావడం లేదంటూ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మహిళలు ప్రశ్నించారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ముదిమాణిక్యం గ్రామంలో శుక్రవారం నూతన గ్రామపంచాయతీ భవనం ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఉచిత కరంటు, సబ్సిడీ గ్యాస్ వంటి సంక్షేమ పథకాలు మాకు రావడం లేదంటూ మహిళలు పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్లారు.

గత సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో గ్రామానికి చెందిన దాదాపు 87 కుటుంబాల ప్రజా పాలన దరఖాస్తులు అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆన్‌లైన్ చేయకుండా వదిలేయడం ద్వారా ప్రభుత్వం నుండి రావాల్సినఉచిత కరెంటు, 500 గ్యాస్ సబ్సిడీ వంటి సంక్షేమ పథకాలు అందడం లేదని వివరించారు.

ఈ విషయాన్ని అధికారులకు చెప్పిన కూడా కనీస స్పందన లేకుండా పోయిందని మంత్రి దృష్టికి మహిళలు తీసుకెళ్లారు. మంత్రి మాట్లాడుతూ 200 యూనిట్లలోపు విద్యుత్ కాల్చిన ప్రతి కుటుంబానికి కరెంటు బిల్లు ఉచితమని, 500కే గ్యాస్ సిలిండర్ అందజేస్తున్నామని తెలిపారు. గ్రామంలో మిస్సయిన 87 ప్రజా పాలన దరఖాస్తులను వెంటనే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ప్రజా పాలన దరఖాస్తులలో ఏర్పడిన ఆన్‌లైన్ సమస్య పరిష్కరిస్తామని మంత్రి మహిళలకు హామీ ఇచ్చారు.

నాకు రాజకీయ ఆశయాలు లేవు

–రాజ్యసబ సబ్యత్వం పై స్పష్టం చేసిన సినినటుడు నాగబాబు

అమరావతి నవంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సోదరుడు, సినినటుడు నాగబాబు రాజకీయ పదవులపై స్పందించారు. ఈ మేరకు ట్విటర్ వేదిక ద్వారా తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. 'నా నాయకుడు జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు సేవ చేయడమే తప్ప నాకు రాజకీయ ఆశయాలు లేవని ' స్పష్టం చేశారు.రాజ్యసభ పదవి కోసం ఢిల్లీ పెద్దలను సంప్రదించారని వచ్చిన వార్తలను ఖండిస్తూ అతను స్వార్థం తెలియని ప్రజానాయకుడు,అతని ప్రతి పని ప్రజా శ్రేయస్సు కోసమే. వ్యక్తిగత స్వార్థానికి అతనెప్పుడు దూరంగానే ఉంటాడని వెల్లడించారు.అతను ఎప్పుడు సత్యానికి, ధర్మానికి కట్టుబడి ఉంటాడు. మన రాష్ట్ర బంగారు భవిష్యత్తు కోసం ఎంతవరకైనా వెళ్తాడు. పోరాడతాడు. ఢిల్లీ వెళ్లిన ఉద్దేశం, స్వార్థ ప్రయోజనాలకోసం కాదని పేర్కొన్నారు . మన రాష్ట్ర ప్రయోజనాలకోసం, పవన్ లాంటి నాయకుడికోసం నా లైఫ్ ని ఇవ్వటానికి నేనెప్పుడూ సిద్ధంగా ఉంటానని స్పష్టం చేస్తూ ట్విట్ చేశారు.

గ్రామ స్థాయి నాయకుల కృషి ఫలితమే..నేడు రాష్ట్రము లో కాంగ్రెస్ ప్రభుత్వం

– టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ. మహేష్ కుమార్ గౌడ్,

హైదరాబాద్ నవంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); గ్రామ స్థాయి నాయకుల కృషి ఫలితమే..నేడు రాష్ట్రము లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ. మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.శుక్రవారం ఇందిరా భవన్ లో జరిగిన పంచాయతీ రాజ్ సంఘటన్ సమావేశం లో పాలోని ప్రసంగించారు.తెలంగాణ లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందంటే అది గ్రామ స్థాయి నాయకుల కృషి ఫలితమే..అనుబంధ సంఘాల చైర్మన్ లలో చాలా మంది కార్పొరేషన్ చైర్మన్ లుగా చేసాము. సేవాదల్, ఆర్.జి.పీఆర్.ఎస్ లు రాహుల్ గాంధీకి చాలా ఇష్టం..ఇది రాజీవ్ గాంధీ కి గ్రామ పంచాయతీ లు అంటే ఇష్టం..73, 74 రాజ్యాంగ సవరణ తోనే గ్రామాలకు హక్కులు వచ్చాయి. ఇది రాజీవ్ గాంధీ గారి కృషి. పివి నరసింహ రావు వీటిని అమలు చేశారు.దీని వల్లనే పంచాయితీ లకు గౌరవం వచ్చిందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీ లను నిర్లక్ష్యం చేసింది. బిల్లులు ఇవ్వకపోవడంతో సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారు కులగణన చాలా ముఖ్యం. ఇది రాహుల్ గాంధీ ఆలోచన..దీని వల్లనే పేదలకు న్యాయం జరుగుతుంది. ఆధాని, అంబానిలను బీజేపీ పెంచి పోషిస్తుంది మన రాష్ట్రంలో కులగణన సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించడం హర్షనీయం. రాజీవ్, రాహుల్, సోనియాగాంధీ లకు పదవుల మీద ఆశ లేదు.మోడీ కి ఫొటోల పిచ్చి.. పెద్దల కోసం ధనవంతుల కోసం బీజేపీ పని చేస్తుంది. బీజేపీ కేంద్రంలో ఇచ్చిన ఒక్క హామీ నెర వేర్చలేదు. ఈ దేశాన్ని ప్రైవేట్ పరం చేసేందుకు మోడీ కుట్ర చేస్తున్నారని విమర్శించారు.దేశాన్ని కాంగ్రెస్ కాపాడుతుంటే బీజేపీ అమ్మేస్తుంది కాంగ్రెస్ పార్టీ లో పంచాయతీ సంఘటన్ చాలా ప్రాముఖ్యత ఉంది వచ్చే లోకల్ బాడీ ఎన్నికలలో గెలవాలి. వ్యక్తుల ప్రభావం అధికంగా ఉండే పంచాయతీ ఎన్నికల్లో మీరు గెలవాలి. సంస్థ ఇంకా బలోపేతం చెయ్యాలి.. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇచ్చినప్పుడు.. జనం కేసీఆర్ కు సిఎం గా అవకాశం ఇచ్చారు బంగారు తెలంగాణ అని ప్రజలను మోసం చేశారు.కేసీఆర్ కుటుంబం బంగారు కుటుంబం గా మారింది.. తెలంగాణను బాగా దోచుకున్నారుతెలంగాణ లో 8 లక్షల కోట్ల అప్పు చేశారు.ఇప్పుడు మనం కేసీఆర్ చేసిన అప్పుకు వడ్డీ కడుతున్నామన్నారు..రైతు రుణ మాఫీ, రైతు బంధు, బోనస్ ఇచ్చినం, ఉద్యోగాలు ఇచ్చినం, 200 యూనిట్ల కరెంట్ ఇచ్చాము, 500 రూపాయల గ్యాస్ ఇచ్చాము, ఆరోగ్య శ్రీ ఇచ్చాము.. అన్ని ప్రజలకు వివరించాలి..మనం చేసిన పనులను ప్రజలకు వివరించాలి.. నిజమైన పేదవాళ్లకు ప్రభుత్వ ఫలాలు అందినపుడే మన లక్ష్యం నెరవేరుతుందన్నారు.

ఎలా విజయోత్సవాలు నిర్వహిస్తున్నారో సమాధానం చెప్పాలి

–బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి డిమాండ్

హైదరాబాద్ నవంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చకుండానే ఏ మొఖం పెట్టుకొని విజయోత్సవాలు నిర్వహిస్తున్నారో సమాధానం చెప్పాలని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి డిమాండ్ చేసారు.శుక్రవారం బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రైతు కూలీలలకు రూ.12వేలు రాలే...రైతు బీమా అమలు కాలే.. పది పంటలకు బోనస్ అన్నారు...ఒక్క పంటకు కూడా ఇయ్యలే.. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు దీనికి సమాధానం చెప్పిన తర్వాత విజయోత్సవాలు జరపాలన్నారు. కాంగ్రెస్ సర్కారు ఏడాది పాలనపై జరుపుకోవాల్సింది విజయోత్సవాలు కాదు.. అబద్ధాల విజయోత్సవాలన్నారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఫసల్ భీమా యోజన పథకాన్ని అమలు చేయకపోవడంతో ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతులు వేలకోట్ల రూపాయలు నష్టపోతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు అభయహస్తం పేరుతో విడుదల చేసిన మేనిఫెస్టోలో వివిధ రకాల రైతు హామీలు ఇచ్చారు.నిజాం షుగర్ ఫ్యాక్టరీ రీఓపెన్, పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామన్నరు.. ఇంతవరకు చేయలే. కేంద్రప్రభుత్వ సహకారంతో నిజామాబాద్ లో పసుపు పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయడం వలన రైతులకు ఎంతో మేలు జరగనుంది. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం రైతులకు క్షమాపణ చెప్పి..రైతులకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని భారతీయ జనతా పార్టీ తరఫున డిమాండ్ చేసారూ.భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో డిసెంబర్ 1వ తేదీ నుండి 5వ తేదీ వరకు చేస్తున్న రాష్ట్రప్రభుత్వ వైఫల్యాలపై ఉద్యమించేలా కార్యక్రమాలు చేపడుతాం. కాంగ్రెస్ ఏడాది పాలనలో రైతులకు జరిగిన అన్యాయాన్ని వివద్రిస్తామన్నారు.. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఊ అంటే ఫాం ఆయిల్ గురించే మాట్లాడుతున్నాడు. కానీ, కేంద్రం ఇస్తున్న రూ.10,500 సబ్సిడీ గురించి మాత్రం చెప్పడం లేదు.లగ్ పతి దీదీ యోజన పేరుతో ప్రధాని నరేంద్రమోదీ మహిళా సంఘాలకు సబ్సిడీలో డ్రోన్లు అందించి శిక్షణ ఇస్తుంటే... డ్రోన్ టెక్నాలజీని రాష్ట్ర ప్రభుత్వమే తెచ్చినట్టు తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతున్నారు.రాష్ట్రంలో వ్యవసాయ పనిముట్లకు కేంద్రం ఇచ్చే సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం అందినివ్వడం లేదు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకాన్ని వ్యవసాయ పంటలకు అనుసంధానం చేస్తామన్నరు..ఇంత వరకు చేయలేదు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తప్పు ఒప్పుకొని రాష్ట్ర రైతులకు మేలు చేయాలని భారతీయ జనతా పార్టీ తరఫున డిమాండ్ చేసారు.కేంద్ర ప్రభుత్వం రైతులకు ఎరువుల మీద ఎకరాకు రూ.18వేల సబ్సిడీ అందిస్తోంది. ఉత్పత్తిని పెంచి రైతుల ఖర్చును తగ్గించడానికి నానో యూరియా, డీఏపీ ఇస్తోంది. చిరుధాన్యాలను ప్రోత్సహించడానికి ఆర్థికసహకారం అందించే ప్రయత్నం నరేంద్రమోదీ ప్రభుత్వం చేస్తోంది.గత పది సంవత్సరాలలో ధాన్యానికి రూ.1000 పైగా మద్దతు ధరలు పెంచింది. కానీ ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయ్యింది. కేంద్రప్రభుత్వం 2013-14లో ధాన్యం కొనుగోలుకు రూ.3వేల కోట్ల ఖరీదుతో వ్యవసాయ పంటలను ఖరీదు చేస్తే నేడు రూ.27వేల కోట్లు వెచ్చిస్తోంది. ఇన్సెంటివ్ చేస్తున్నా కూడా సరైన సమయంలో రైతుల దగ్గర ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బంది పెడుతున్న రాష్ట్ర ప్రభుత్వం నిస్సిగ్గుగా విజయోత్సవాలు చేసుకునేందుకు సిద్ధమైందని విమర్శించారు.. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోయినా తెలంగాణ ప్రజల అభివృద్ధే లక్ష్యం అని నరేంద్రమోదీ ప్రభుత్వం నింపంతపంపని పనిచేస్తున్నది.కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి , బండి సంజయ్ , పార్లమెంటు సభ్యులు నిరంతరం చేసే కృషితోనే ఇతోదికంగా మన రాష్ట్రానికి కేంద్రప్రభుత్వం సహకారం అందిస్తున్నది.గతంలో ప్రధాని నరేంద్రమోదీ గారే వరంగల్ కు స్వయంగా వచ్చి రైల్వే వ్యాగన్ ఓవర్ హాలింగ్ యూనిట్ కి శంకుస్థాపన చేశారు. ఇది కేవలం వర్క్ షాపే కాదు....రైల్ ఇంజిన్లను కూడా ఇక్కడే తయారు చేస్తమని మోదీ చెప్పారు.ఇటీవల కేంద్రం నుండి ఖాజీపేటలో రైల్ ఇంజిన్ ల ఉత్పత్తి, పెట్టెల తయారీ కోసం పూర్తి చర్యలు తీసుకొమ్మని రైల్వే జోనల్ మేనేజర్ గారికి ఆదేశాలు వచ్చాయి. దీని విషయంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ తరఫున, తెలంగాణ ప్రజల పక్షాన ప్రధాని నరేంద్రమోదీ , కేంద్ర రైల్వే శాఖ మంత్రి ధన్యవాదాలు తెలియజేస్తున్నమన్నారు..రాష్ట్రంలో టూరిజం అభివృద్ధి కోసం కేంద్రం ఎన్నో ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే తెలంగాణలోని రామప్ప ఆలయం యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు సాధించటానికి మోదీ ప్రభుత్వం కృషి చేసింది. రామప్ప టూరిజం సర్క్యూట్ కోసం రూ. 73.74 కోట్ల నిధులు, సోమశిల పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టు కు రూ. 68.10 కోట్ల నిధులు మంజూరు చేసిన ప్రధాని నరేంద్ర మోదీ , కేంద్ర సాంస్కృతిక మరియు పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.ఈ కొత్త ప్రాజెక్టులతో తెలంగాణ రాష్ట్రం పర్యాటకంగా మరింత అభివృద్ధి చెంది, స్థానికులకు మరిన్ని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కే అవకాశం ఉంది.కేంద్రం ఇంత అభివృద్ధి చేస్తున్నా కూడా...రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు వాళ్లే చేస్తున్నట్టు గప్పాలు కొట్టుకోకుండా... కేంద్ర ప్రభుత్వం చేసే అభివృద్ధిని స్వాగతించాలన్నారు.

ప్రత్యేక అధికారులు ప్రతివారం వసతి గృహాలు ,సంక్షేమ గురుకుల పాఠశాలలు, కేజీబీవీ లు తనిఖీలు చేయాలి .

–జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి.

–మండలాల ప్రత్యేక అధికారులు, సంక్షేమ పాఠశాలల ఆర్ సి ఓ ల తో కలెక్టర్ సమీక్ష.

–వసతి గృహాలు గురుకులాలలో అవసరమైన మరమ్మత్తుల కోసం ప్రతిపాదన సిద్ధం చేయాలి.

సంగారెడ్డి, నవంబర్ 29: (నేటినిజం ప్రతినిధి):జిల్లాలోని కస్తూరిబా పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, సంక్షేమ గురుకుల పాఠశాలాలు , మాడల్ పాఠశాలలలో మండల ప్రత్యేక అధికారులు,ఆయా సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు, ఆర్ సి ఓ లు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్లో ఆయా శాఖల అధికారులు ,గురుకులాల , కేజీబీబీల ప్రత్యేక అధికారుల తో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని అన్ని మండలాల ప్రత్యేక అధికారులు ఆయా మండలాల పరిధి సంక్షేమ వసతి గృహాలు సంక్షేమ గురుకుల పాఠశాలలను కేజీబీవీపీలను మోడల్ పాఠశాలలను ప్రతి వారం తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో ,కళాశాలలో ,విద్యార్థులతో కలిసి భోజనం చేయాలన్నారు . వసతి గృహాలు సంక్షేమ గురుకుల పాఠశాలల ఆవరణలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు తనిఖీ సమయంలో ఆయా సంస్థల్లోని వంట గదులు, స్టోర్ రూమ్లను డైనింగ్ హాల్ లను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు . తరగతి గదులు విద్యార్థుల గదులను కిటికీలు డోర్లు అవసరమైన మరమ్మతులకు ప్రతిపాదన సిద్ధం చేయాలన్నారు. అవసరమైన అద్దె భవనం యజమానులతో మాట్లాడి వెంటనే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. వసతి గృహాలకు అవసరమైన కాంపౌండ్ వాల్ , సోలార్ ఎలక్ట్రిక్ ఫెన్సింగ్ కు సంబంధించిన నివేదికలు అందించాలన్నారు వసతి గృహాలకు విద్యార్థులకు సరిపడా మంచినీటి కనెక్షన్లు ఇప్పించాలని మిషన్ భగీరథ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. తాగునీరు అందించే విషయంలో అలసత్వం వహించద్దు అన్నారు. మిషన్ భగీరథ , ఆర్డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ వసతి గృహాలు సంక్షేమ గురుకుల పాఠశాలలో కస్తూర్బా పాఠశాలల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. అధికారులు వసతి గృహాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందుతుందా లేదా తెలుసుకోవాలన్నారు. వసతి గృహాల సందర్శన సమయంలో స్టోర్ రూమ్లను పరిశీలించి నాసిరకం వస్తువులను వెంటనే వెనక్కి పంపేలా చర్యలు తీసుకోవాలన్నారు. బియ్యంలో తెల్ల పురుగులు లాంటివి వస్తే వెంటనే స్టాకు వెనక్కు పంపాలన్నారు. ఎక్స్పిరీ డేట్ అయిన వస్తువులను వెంటనే స్టాక్ నుండి తీసివేయించాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం తయారు చేసేలా వంట ఏజెన్సీ సిబ్బంది , విద్యార్థుల సంఖ్యకు సరిపడా నియమించుకోవాలని కలెక్టర్ ఆయా శాఖల అధికారులు ఆదేశించారు. వసతి గృహంలో ఉన్న ప్రతి చిన్న సమస్యలు సైతం గుర్తించి వాటి మరమ్మత్తులకు హార్తిస్థాయి నివేదికను అందజేయాలన్నారు. ప్రైవేటు అద్దె భవనాల్లో ఉన్న సంస్థల లో అవసరమైన మనమత్తులను ఆయా భవనాల యజమానులతో మాట్లాడి వెంటనే మనమతులు చేపట్టాలన్నారు. ఎక్కడైనా అధికారులు తమ విధులు పట్ల నిర్లక్ష్యంగా వహించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్ ,మాధురి , జడ్పీసీఈఓ జానకి రెడ్డి , జిల్లాలోని వివిధ మండలాల ప్రత్యేక అధికారులు బీసీ ఎస్సీ ఎస్టీ సంక్షేమ వసతి గృహాల, గురుకుల పాఠశాలల ప్రత్యేక అధికారులు , ఆర్సిఓలు పాల్గొన్నారు.

వేదికపైకి వెళ్లేందుకు బీజేపీ మాజీ ఎమ్మెల్యే యత్నం..

భోపాల్, నవంబర్ 29: బీజేపీ మాజీ ఎమ్మెల్యే వేదికపైకి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఆ పార్టీ కార్యకర్తలు ఆయనను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా దురుసుగా ప్రవర్తించిన మాజీ ఎమ్మెల్యేను వారు కొట్టారు. (ఈనీతీఎవతీ ఃఏఖ ఓఒం ఃవజీబివని) ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. బీజేపీ అధికారంలో ఉన్న మధ్యప్రదేశ్‌లో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం ఉజ్జయినీలోని మహిద్‌పూర్‌లో బీజేపీ కార్యక్రమం జరిగింది. ఉజ్జయినీ ఇన్‌చార్జి మంత్రి గౌతమ్ తెత్వాల్, ఎంపీ అనిల్ ఫిరోజియా పాల్గొన్న ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బహదూర్ సింగ్ చౌహాన్‌ను పార్టీ నేతలు ఆహ్వానించలేదు.

కాగా, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడైన బహదూర్ సింగ్ చౌహాన్ ఆ కార్యక్రమంలో పాల్గొనేందుకు అక్కడకు చేరుకున్నారు. వేదికపైకి వెళ్లేందుకు ఆయన ప్రయత్నించగా పార్టీ నేతలు, కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో ఆయన వారితో దురుసుగా ప్రవర్తించారు. ఈ సందర్భంగా ఘర్షణ జరిగింది. ఆగ్రహించిన బీజేపీ కార్యకర్తలు చౌహాన్‌ను కొట్టారు. మిగతా నేతలు కల్పించుకుని సర్దిచెప్పారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపే శక్తి పర్యాటకానికి ఉంది: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, నవంబర్ 29:ఎంతో మంది జీవితాల్లో భాగ్యాన్ని నింపే శక్తి పర్యాటక రంగానికి ఉందని ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ ఈ రోజు అన్నారు. అలాగే భారత దేశంలోని అద్భుతాలను పర్యాటకులు ఆస్వాదించేలా పర్యాటక రంగ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తుందని స్పష్టం చేశారు.కేంద్ర మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్ ఎక్స్ లో చేసిన పోస్టుపై శ్రీ మోదీ స్పందిస్తూ: "ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపే సామర్థ్యం పర్యాటక రంగానికి ఉంది. అద్భుతాలను ఎక్కువ మంది ప్రజలు అనుభూతి చెందేలా భారత్‌లో పర్యాటక రంగ మౌలిక సదుపాయాలను మెరుగుపరిచడంపై మా ప్రభుత్వం దృష్టి సారిస్తుంది" అని తెలిపారు.

వనసమారాధనలో స్మార్ట్ కిడ్జ్ చిన్నారుల అల్లరే అల్లరి

ఖమ్మం, నవంబర్ 29: (నేటినిజం ప్రతినిధి): ఇద్దరు పిల్లలు ఎవరైనా ఒకచోట చేరితే వారు చేసే అల్లరి అంతా ఇంతకాదు...అలాంటిది ఓ సామూహంగా పిల్లలంతా ఒకచోటకు చేరితే వారు చేసే అల్లరి మాటల్లో చెప్పలేం. కార్తీక మాసం పురస్కరించుకుని స్మార్ట్ కిడ్జ్ పాఠశాల ఆధ్వర్యంలో చెరుకూరి వారి మామిడితోటలో నిర్వహించిన వనసమారాధనలో పాఠశాల పిల్లలంతా ఓ చోటకు చేరి ఆటలు ఆడుతూ...ఎగిరి పాటలు పాడుతూ...ఈలలు వేస్తూ గోల గోల చేశారు. అల్లరి చేయడానికి కాదేది అనర్హం అన్న చందంగా వనమంతా కలియ తిరుగుతూ సందడి చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాల సిబ్బంది పర్యవేక్షణలో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు రకాల ఆటల పోటీల్లో పాల్గొని బహుమతులు అందుకున్న చిన్నారుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. మధ్యాహ్నం సమయంలో పసందైన వంటకంబు పెట్టించి మరీ పాఠశాల యజమాన్యం పిల్లలందరినీ ఉత్సాహపరిచింది. ఈ కార్యక్రమంలో స్మార్ట్ కిడ్జ్ పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య, డైరెక్టర్ చింతనిప్పు సుకన్య తదితరులు పాల్గొన్నారు.




గురజాడ 109 వ వర్ధంతి
వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, హైదరాబాద్
&
గురజాడ ఫౌండేషన్ (అమెరికా-భారత)
సంయుక్త నిర్వహణలో
యువ చైతన్య దినోత్సవం
మహాకవి గురజాడ ఆలోచనలు, ఆకాంక్షలు- నేటి ప్రాసంగికత
జాతీయసదస్సు
వేదిక: పీజీ సెమినార్ హాల్, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, హైదరాబాద్, తెలంగాణ
తేదీ: 30 నవంబరు 2024, సమయం: 9:30 AM - 5 PM ప్రారంభ కార్యక్రమం: 9.30 AM - 1 PM
ముఖ్య అతిథి:
ఆచార్య సూర్యా ధనంజయ్,
ఉపకులపతి, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
ప్రత్యేక అతిథి:
ఆచార్య జి.పరమేశ్వరమ్మ,
ప్రత్యేక అధికారి, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
విశిష్ట అతిథి:
శ్రీమతి దారిశి రాధారాణి,
విశ్రాంత ప్రధానాచార్యులు, తెలంగాణ గురుకుల విద్యాసంస్థలు, హైదరాబాద్.
ఆత్మీయ అతిథి:
డా. ఏలే బబయమ్మ,
సహాయాచార్యులు, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
కీలకోపన్యాసం:
డాక్టర్ వాడ్రేవు వీరలక్ష్మీదేవి,
ప్రముఖ సాహితీవేత్త, సాహిత్య విమర్శకురాలు, విజయవాడ.
సభాధ్యక్షులు, సన్మాన లక్ష్యం:
ఆచార్య కొప్పు గోపాలకృష్ణ (USA),
కేన్సర్ జీవిత రూపకర్త భాషావేత్త, ప్రధాన సంపాదకులు, ప్రకాశిక
ఆహ్వానం, సభ నిర్వహణ:
డా.బోలుగద్ది అనిల్ కుమార్,
సాహితీవేత్త, భాషా ప్రశిక్షకులు, భాషకీయ సేవా సంస్థలు, హైదరాబాద్.
వందన సమర్పణ:
డా. గడ్డం మోహన్ రావు,
వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
వస్త్రే వైజయంతీగత రచనలు చేసిన మహాకవి గురజాడ అప్పారావు గారి 109 వ వర్ధంతిని గురజాడ ఫౌండేషన్ (అమెరికా-భారత్) "యువత చైతన్య దినోత్సవం"గా జరుపుతోంది. భారత ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు గురజాడ వర్ధంతిని ప్రతీ ఏటా "యువత చైతన్య దినోత్సవం"గా అధికారికంగా జరపాలని గురజాడ ఫౌండేషన్ కోరుతోంది.
సమన్వయ, సర్వాహకులు:
ఆచార్య సూర్యా ధనంజయ్, ఆచార్య గోపాలకృష్ణ కొప్పు,
డా.బోలుగద్ది అనిల్ కుమార్, డా.గడ్డం మోహన్‌రావు, డా. మారోజు దేవేంద్ర
మొదటి సమావేశం : (తేది : 30.11.2024),
వేదిక : పిజి సెమినార్ హాల్, సమయం : మధ్యాహ్నం 2 - 3.30గం. వరకు
అధ్యక్షులు:
డా. మారోజు దేవేంద్ర,
అధ్యాపకురాలు, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
పత్ర సమర్పణ అంశం : గురజాడ కథానికలు – స్త్రీపాత్రలు
పత్ర సమర్పకులు – అంశాలు
డా. గడ్డం మోహన్‌రావు
అధ్యాపకులు, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
పత్ర సమర్పణ అంశం : గురజాడ ఆలోచనా సరళి – ఆచరణ, ఆవశ్యకత
డా. పి. హంసమ్మ
అధ్యాపక

స్టార్ మా లో ఓ డైనమిక్ అమ్మాయి కథ "గీత ఎల్ఎల్ బి"

హైదరాబాద్ నవంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్);మహిళలు ఏ రంగంలో అయినా తమ ప్రతిభతో రాణించడానికి ఇప్పుడు ఆకాశమే హద్దు. ఎందరో ఇలా నిరూపించుకుని చరిత్ర సృష్టించారు. ఈ పరంపరలో ఎల్ ఎల్ బి చదువుకుని, లాయర్ గా తన వాదన వినిపించడానికి వస్తున్న గీత కథ ఇప్పుడు ప్రతి తెలుగు లోగిలినీ ప్రత్యేకంగా అలరించబోతోంది. డిసెంబర్ 2 నుంచి రాత్రి 9.30 గంటలకు తెలుగు వారి అభిమాన ఛానల్ "స్టార్ మా" లో ఈ సీరియల్ ప్రారంభం కాబోతోంది. ధైర్యసాహసాలతో, ఆత్మవిశ్వాసంతో లక్ష్య సాధన కోసం నమ్ముకున్న సిద్ధాంతాన్ని ఆచరించే "స్టార్ మా" సీరియల్ కథల పరంపరలో రానున్న "గీత ఎల్ ఎల్ బి" పూర్తిగా ఒక విలక్షణమైన కథ. బంధాలకు విలువ ఇచ్చి, వాటిని నిలబెట్టాలనుకునే అమ్మాయి జీవితంలో ఎదురయ్యే ఒడుదుడుకులు, తడబడినా నిలబడడానికి ఆ అమ్మాయి చేసే ప్రయత్నాలు, ఎదురైన రకరకాల జీవితం. ఒక సగటు అమ్మాయి జీవితంలో.. ఎవరు తనకు ప్రేరణ అనుకుందో అతనితోనే గొడవకు దిగాల్సి రావడం ఆమెకు ఎదురైన అతిపెద్ద సవాలు. న్యాయాన్ని గెలిపించడానికి ఆ అమ్మాయి పడే తపన, కొన్నిసార్లు ఆమె అనుభవించే సంఘర్షణ "గీత ఎల్ ఎల్ బి" సీరియల్ ని విభిన్నమైన సీరియల్ గా నిలబెట్టబోతోంది. సోమవారం నుంచి శుక్రవారం వరకు ఈ సీరియల్ ప్రతివారం అలరించబోతోంది.

అమెజాన్ బ్లాక్ ఫ్రైడే ఆఫర్లు.. ఈ బ్యాంకుల కార్డులపై 10 శాతం డిస్కౌంట్..!

ంఎజీళినీని ఃశ్రీజీఞ ఈతీతిటజీఎ రాజీశ్రీవ । ప్రముఖ ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్ అమెజాన్ బ్లాక్ ఫ్రైడే సేల్ ప్రారంభమైంది. శుక్రవారం నుంచి వచ్చేనెల రెండో తేదీ వరకూ ఈ సేల్ కొనసాగ ంతుంది. అమెరికాలో షాపింగ్ సీజన్ ప్రారంభానికి సూచికగా బ్లాక్ ఫ్రైడే సేల్ నిర్వహిస్తారు. దేశీయంగా నాలుగు రోజుల పాటు సాగే బ్లాక్ ఫ్రైడే సేల్ లో స్మార్ట్ ఫోన్లు, టీవీలు, ఇతర గృహోపకరణాలు, ఫ్యాషన్ ఉత్పత్తులపై అమెజాన్ ఆకర్షణీయ ఆఫర్లు అందిస్తున్నది.

శాంసంగ్ గెలాక్సీ ఎస్23 ఫోన్ ఎంఆర్పీ రూ.1,24,999 కాగా, ఆఫర్ కింద రూ.74,999లకే అందుబాటులోకి వస్తుంది. ఆపిల్, ఐక్యూ, వన్‌ప్లస్, రియల్‌మీ, రెడ్‌మీ, టెక్నో స్మార్ట్ ఫోన్లతోపాటు ఎలక్ట్రానిక్ వస్తువులపై 40 శాతం నుంచి 75 శాతం వరకూ డిస్కౌంట్ ఇస్తున్నట్లు అమెజాన్ వెల్లడించింది. ఎయిర్ కండీషనర్లపై 65 శాతం డిస్కౌంట్ అందిస్తోంది. ఆపిల్ మ్యాక్ బుక్ ఎయిర్ ఎం1-2020 లాప్ టాప్ ఎంఆర్పీ ధర రూ.89,900 కాగా, ఆఫర్ కింద రూ.59,990లకు లభిస్తుంది. యాక్సిస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, వన్ కార్డు, హెచ్డీఎఫ్సీ బ్యాంకు కార్డులపై పది శాతం డిస్కౌంట్ అందిస్తోంది.

అబద్ధాలను అల్లటంలో ఆస్కార్ అవార్డు ఇవ్వాలి

- పిసిసి ప్రెసిడెంట్ వైఎస్ షర్మిల

అమరావతి నవంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : సెకీతో విద్యుత్ ఒప్పందాలలో అబద్ధాలను అందంగా అల్లటంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఆస్కార్ అవార్డు ఇవ్వాలని వైఎస్ షర్మిల విమర్శించారు. శాలువలు, సన్మానాలు, అవార్డులు కోరుకొనే ముందు జగన్ కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పాలని ట్విటర్‌లో లో డిమాండ్ చేశారు. 2021 మే నెలలో సెకీ (ఞఇఅఎ) వేసిన వేలంలో యూనిట్ ధర గరిష్ఠంగా రూ.2.14 పైసలు ఉంటే, రూ 2.49 పైసలకు కొన్నందుకు శాలువలు కప్పాలా ? అంటూ ఎద్దేవా చేశారు. అదానీ వద్ద గుజరాత్ రాష్ట్రం యూనిట్ ధర రూ 1.99 పైసలకే కొంటే.. అదే కంపెనీ నుంచి 50పైసలు ఎక్కువ పెట్టి, రూ.2.49 పైసలకు కొన్నందుకు మీకు సన్మానాలు చేయాలా ? అదానీతో ఒప్పందానికి దేశంలో ఏ రాష్ట్రం ముందుకు రాకుంటే. ఆగమేఘాల మీద ఒప్పందానికి మీరు ముందుకు వచ్చినందుకు మీకు అవార్డులు ఇవ్వాలా ? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు.ట్రాన్స్మిషన్ ఛార్జీల భారం అక్కడ ఇక్కడ లేకుంటే గుజరాత్‌కి ఇచ్చిన రేటు ప్రకారం ఏపీకి రూ 1.99 పైసలకు అదానీ ఎందుకు ఇవ్వలేదని పేర్కొన్నారు. ఒక ముఖ్యమంత్రిని ఒక వ్యాపారవేత్త అధికారికంగా కలిస్తే గోప్యత పాటించడం దేశంలో ఎక్కడైనా ఉందా ? దమ్ముంటే జగన్ మోహన్ రెడ్డి సమాధానం చెప్పాలని కోరారు.

రూ.1,750 కోట్లు ముడుపులు ఇవ్వడం చరిత్ర

అదానీతో ఒప్పందం రాష్ట్రంలోనే కాదు అంతర్జాతీయంగా చరిత్రనేని, రూ.1750 కోట్లు నేరుగా ముఖ్యమంత్రికి ముడుపులు ఇవ్వడం చరిత్రేనని ఆరోపించారు. ఎవడు కొనేందుకు ముందుకు రాని విద్యుత్‌ను బంపర్ ఆఫర్‌గా ప్రకటించుకోవడం , గంటల్లోనే క్యాబినెట్ పెట్టి, ప్రజా అభిప్రాయం లేకుండా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం , అదానీ కోసం అన్ని టెండర్లు రద్దు చేయడం చరిత్ర. ఒక వ్యక్తి స్వప్రయోజనాల కోసం ఏపీ రాష్ట్ర ప్రజల నెత్తిన రూ.1.67 లక్షల కోట్ల భారాన్ని మోపడం చరిత్రేనని విమర్శించారు.అమెరికా దర్యాప్తు సంస్థలు ఇచ్చిన రిపోర్ట్ లో నాపేరు ఎక్కడుందని బుకాయిస్తున్నారని షర్మిల ఆరోపించారు. ఏపీ సీఎంగా అంటే ఆనాడు మీరు కారా. ఆ కుర్చీలో మీరు కాకుండా మిమ్మల్ని నడిపించే వాళ్లు కూర్చున్నారా? సమాదానం చెప్పాలని డిమాండ్ చేశారు. ముడుములు ముట్టాకే ఒప్పందాలు చేసుకున్నారని ఓ వంద పేజీల రిపోర్ట్ కూడా ఇచ్చాయని వెల్లడించారు. గత టీడీపీ ప్రభుత్వం ఎక్కువ ధరకు పీపీఎల్(ఖఖఒ) చేసుకుందని, రూ.35వేల కోట్ల భారం వేసిందని ఆరోపించిన జగన్ అధికారంలో ఉండి ఏం చేశారని ప్రశ్నించారు.టెండర్లను ఎందుకు రద్దు చేయాలేదని , ఎందుకు విచారణ జరిపించలేదని ట్విటర్‌లో నిలదీశారు. నిజంగా అదానీతో చేసుకున్న ఒప్పందంలో అవినీతి లేకుంటే, అదానీ వల్ల ఆర్థికంగా లబ్ది పొందలేదని అనుకుంటే బైబిల్ మీద ప్రమాణం చేయాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు.

పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనా న్ని విజయవంతం చేయండి

- అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి

కరీంనగర్, నవంబర్ 29: (నేటినిజం ప్రతినిధి)
కరీంనగర్ ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానంలో ఆదివారం

నిర్వహించే పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలనీ అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి పిలుపునిచ్చారు.. శుక్రవారం ఎస్ ఆర్ ఆర్ మైదానం నభ స్థలిలో భూమి పూజ చేసి ఏర్పాట్లను పరిశీలించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనానికి మేధావులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, ఊపాధ్యాయులు, ఎల్ఐసి ఉద్యోగులు, డాక్టర్లు లు వివిధ రంగాల ప్రముఖులు, భారీ ఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు.. ఆయన వెంట ల రవీందర్ రెడ్డి, ఎర్రం శెట్టి మునిందర్ ,మహిపాల్ రెడ్డి,యూత్ లీడర్ కోమటిరెడ్డి అశోక్ రెడ్డి, నవీన్ రెడ్డి తదితరులు ఉన్నారు

పలు ప్రైవేట్ కార్యక్రమాలకు హాజరైన దయాకర్ రెడ్డి

ఖమ్మం, నవంబర్ 29: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి శుక్రవారం పలు ప్రైవేట్ కార్యక్రమాలకు హాజరయ్యారు. రామన్నపేటలోని మామిడితోటలో జరిగిన విశ్వబ్రాహ్మణ కులస్తుల వనసమారధానలో పాల్గొన్నారు. ఖమ్మం నగరం ఖనాపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన సెలూన్ ను ప్రారంభించారు. అదేవిధంగా అనారోగ్యంతో బాధపడుతూ ఖమ్మంలోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కూసుమంచి మండలం పెరిక సింగారం గ్రామానికి చెందిన బొక్క ఇంద్రసేనా రెడ్డి ని పరామర్శించారు.

బహ్రెయిన్‌లో ఘనంగా కేసీఆర్ దీక్షా దివస్..!

హైదరాబాద్, నవంబర్ 29:తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ 2009 నవంబర్ 29న అమరణ నిరాహార దీక్ష చేపట్టి 15 ఏండ్లు పూర్తయింది. ఈ నేపథ్యంలో కేసీఆర్ దీక్షా దివస్ కార్యక్రమం బీఆర్ఎస్ బహ్రెయిన్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. బీఆర్ఎస్ బహ్రెయిన్ శాఖ అధ్యక్షులు రాధారపు సతీష్ కుమార్

, ఉపాధ్యక్షులు వెంకటేష్ బొలిశెట్టి మాట్లాడుతూ 2009 నవంబర్ 29న కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణ ఉద్యమాన్ని మలుపుతిప్పిన మర్చిపోలేని రోజు అని పేర్కొన్నారు. స్వరాష్ట్ర కల సాకారానికి పునాది వేసిన రోజు, తెలంగాణ చరిత్రలో నిలిచిపోయే శుభదినం అని వ్యాఖ్యానించారు. నాలుగు కోట్ల తెంగాణ ప్రజలు ముక్త కంఠంతో మా తెలంగాణ మాకు కావాలని నినదించారన్నారు.

'కేసీఆర్ సచ్చుడో తెలంగాణ తెచ్చుడో అని తెగువను ప్రదర్శించిన నాయకుడికి అండగా నిలబడి దేశ రాజకీయ వ్యవస్థను కదిలించిన సందర్భం దీక్షా దివస్. అందర్నీ మెప్పించి ఒప్పించి, దేశ రాజకీయ వ్యవస్థను, రాష్ట్రంలో ఉండే రాజకీయ వ్యవస్థను కులమతాలకు అతీతంగా అందరిని కలిపిన సందర్భమే దీక్షా దివస్. నాటికి, నేటికీ ఏం మారింది. కొట్లాడి సాధించుకున్న తెలంగాణను మేలిమి బంగారంగా మార్చుకున్నాం. అభివృద్ధి చేసుకున్నాం. కేసీఆర్ పాలనలో సబ్బండ వర్గాలు సంక్షేమ ఫలాలు అనుభవించాయి. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అమలైన హామీలు ప్రతి ఇంటికీ చేరినయి.ప్రజల మదిలో చెరగని ముద్ర వేసి, చరిత్ర మరవని నిజమైన 'ప్రజా పాలన'కు నిదర్శనంగా నిలిచినయి' అని సతీష్ కుమార్, వెంకటేశ్ బొలిశెట్టి పేర్కొన్నారు.

'తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పదేండ్లలో ఘనంగా అభివృద్ధి చెంది, పచ్చగా ఉన్న తెలంగాణ మీ ఏడాది పాలనలోనే ఏ విధంగా వందేండ్ల విధ్వంసానికి గురైంది. అధికారం కోసం అడ్డగోలు హామీలిచ్చి, ప్రజా పాలనా అని ఆరు గ్యారెంటీలు అని తెలంగాణ ప్రజలను నమ్మించి మోసం చేశారు. జేబునిండా డబ్బులతో దర్జాగా బతికిన రైతన్నను కాంగ్రెస్ సర్కారు బేడీలు వేసి ఠాణాల చుట్టూ తిప్పుతున్నది. . రైతుబంధు, రైతు బీమా, 24గంటల ఉచిత కరెంటు, సాగునీరు, పంటల కొనుగోళ్లు చేపట్టి రైతన్నకు కేసీఆర్ సర్కారు వెన్నెముకగా నిలిస్తే, రేవంత్ పాలనలో రైతన్న ఆగమవుతున్నది.మీ ఏడాది పాలనలో తెలంగాణలో ఎక్కడ చుసిన అర్తనాదాలు తప్ప సంతోషాలు లేకుండా చేస్తున్నారు. తెలంగాణ ప్రజలు మీకు నమ్మి అధికారం ఇస్తే మీరు ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయమని , మీ వోసాలను, అన్యాయాలను, అవినీతిని ప్రశ్నిస్తే హామీలపై చేతులెత్తేసి పరిపాలన చేతగాక మీ ప్రజాపాలనలో నాయకులపై కేసులు పెడుతూ, జర్నలిస్టులపై దాడులు చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ, పాలనలోని లోపాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న సోషల్ మీడియా వారియర్లను బేరిస్తూ, అరెస్టులు చేస్తున్నారు. హామీలను మరిచిన సీఎం రేవంత్‌రెడ్డి విజయోత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తంచేశారు' అని సతీష్ కుమార్, వెంకటేశ్ బొలిశెట్టి వ్యాఖ్యానించారు.

'ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని ఆరు గ్యారంటీలను అమలు చేసేదాకా ప్రజల పక్షాన పోరాడుతాం , ప్రశ్నిస్తాం. కేసీఆర్ గారి ఆనవాళ్లు లేకుండా చేస్తా అని, ఉద్యమ నేతను ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం తప్ప అంతకంటే చేసింది ఏమిలేదు. ఇప్పుడు కొడంగల్‌లోనే ప్రజలు తిరగబడ్డారు. రానున్న రోజుల్లో తెలంగాణలో కూడా తిరగబడరారు. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేయడం ఎవరి తరం కాదు తెలంగాణ ఉన్నంత కలం ప్రజల గుండెల్లో కలకలం పదిలంగా వుంటారు. తెలంగాణను తెచ్చిన కేసీఆర్‌ను ప్రజలు ఎప్పటికి మరువలేరు. ప్రజలు మీ ఏడాది పాలనలో ఎం కోల్పోయారో చాల తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో మీకు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా వున్నారు. తెలంగాణకు అప్పుడైనా, ఇప్పుడైనా, ఎప్పటికైనా స్వీయ రాజకీయ అస్తిత్వమే శ్రీరామ రక్ష అని సతీష్ కుమార్, వెంకటేశ్ బొలిశెట్టి తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎన్నారై బీఆర్ఎస్ సెల్ ప్రధాన కార్యదర్శి మగ్గిడి రాజేందర్, అన్నారం సుమన్ , కార్యదర్శులు, చెన్నమనేని రాజేందర్, సంగేపోలు దేవన్న, ఉత్కం కిరణ్ గౌడ్, చిలుకూరి రాజలింగం , వెంకటేష్, సాగర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వానం
తెలంగాణ రచయితల సంఘం
పదేండ్ల సాహిత్య సభలు
తెలంగాణ అస్తిత్వ సాహిత్యం - వర్తమాన సందర్భం
తెలంగాణ రచయితల సంఘం
8 అక్టోబర్, 2024, ఉదయం 10.30 నుంచి సాయంత్రం 7.30 వరకు
రవీంద్రభారతి సమావేశ మందిరం
ప్రారంభ సమావేశం
ఉ.10.30 నుంచి మ.1 గంట వరకు
అధ్యక్షులు : డా.నాళేశ్వరం శంకరం
ప్రారంభోపన్యాసం : పరాంకుశం వేణుగోపాల స్వామి
ఆత్మీయ అతిథులు
డా.సంబని సిధారెడ్డి
దేశపతి శ్రీనివాస్
ఆచార్య సూర్యా ధనుంజయ్
డా.ఏసుగు నరసింహారెడ్డి
డా.మామిడి హరికృష్ణ
కందుకూరి శ్రీరాములు
కార్యదర్శి నివేదిక : డా.వి.శంకర్
స్వాగతం : ఘనపురం దేవేందర్
వందన సమర్పణ : కొత్త అనిల్ కుమార్
మధ్యాహ్న భోజనం - 1 గం. నుంచి 2 వరకు
సాహిత్య సదస్సు
మ.2 గం. నుంచి మ.4 గం. వరకు
తెలంగాణ అస్తిత్వ సాహిత్యం - వర్తమాన సందర్భం
అధ్యక్షులు : పాట్లపల్లి శ్రీనివాస రావు
ప్రసంగాలు
సాహిత్యం : ఆచార్య సి.కాశీం
సంస్కృతి : కొల్లాపురం విమల
భాష : ఆచార్య బాణాల భుజంగరెడ్డి
స్వాగతం : బెల్లంకొండ సంపత్ కుమార్
వందన సమర్పణ : డా.పాన్నాల బాలయ్య
పుస్తకావిష్కరణలు
మ.4.00 నుంచి 5.30 వరకు
ఇల్లు (కవితా సంకలనం- సంపాదకత్వం: కీ.శే.జంగ వీరయ్య -వీణ్జి)
ఆవిష్కర్త: శ్రీ బైస దేవదాసు
నిశీత (డా.వి.శంకర్ సాహిత్య వ్యాసాలు)
ఆవిష్కర్త: ఆచార్య సి.కాశీం
పచ్చబొట్టు (కవితా సంపుటి)
కవులు : డా.నాళ్ళేరం శంకరం
జి.నరసింహస్వామి
ఘనపురం దేవేందర్
తిరుమల శ్రీనివాస్ ఆర్య
సరాల సుధాకర్
ఆవిష్కర్త: డా.సంబని సిధారెడ్డి
స్వాగతం : డా.జిడి రమేశ్
నిర్వహణ : జిల్లా మహేందర్
వందన సమర్పణ : ఎం.కవిత
కవి సమ్మేళనం
సా. 5.30 నుంచి 7.30 వరకు
సభాధ్యక్షులు : డా.గండ్ర లక్ష్మణరావు
ఆత్మీయ అతిథి : వారాల ఆనంద్
నిర్వహణ : దాస్యం సేనాధిపతి
స్వాగతం : జి.చలపతి
వందన సమర్పణ : రుద్రంగి రమేశ్
పాల్గొను కవులు
ఆచార్య కలువకుంట రామకృష్ణ, వి.ఆర్.విద్యార్థి, డా.చెమన్, శ్రీరామోజు హరగోపాల్, పప్పుల రాజిరెడ్డి, ఆకారాజు, డా.ఆంధోజు పరమాత్మ, దాసరాజు రామారావు, మోతుకూరి అశోక్ కుమార్, డా.సామిడి జగన్ రెడ్డి, డా.తైదల అంజయ్య, కందాళై రాఘవాచార్య, డా.రూప్ కుమార్ దబ్బకార్, నెల్లుట్ల రమాదేవి, అయినంపూడి శ్రీలక్ష్మి, దేవనపల్లి వీణావాణి, డా.సిద్దెంకి యాదగిరి, వాసరచెట్ల జయంతి, సిహెచ్.ఉషారాణి, గద్దం సులోచన, ఎం.కవిత, గంధీరావుపేట యాదగిరి, జి.నరసింహస్వామి, సిహెచ్.ప్రకాశ్, దేశపతి కృష్ణమూర్తి, నల్లగొండ రమేశ్, మధుకర్ వైద్యుల, దాసరి మోహన్, యరకల యాదయ్య, గుర్రాల మాధవ్, నరాల సుధాకర్, గుండెజి ఇస్తారి, సింంబరాజు యాదగిరి, నక్క సురేశ్, గజ్జెల రామకృష్ణ.
అందరూ ఆహ్వానితులే..
తెలంగాణ రచయితల సంఘం

సమరశీలానికి అరుణాంజలి

- కడపటి వీడ్కోలుకు కదిలొచ్చిన జనం
- అశ్రునయనాల మధ్య పోటు ప్రసాద్ అంతిమ యాత్ర
- అమర్ హై నినాదాల మధ్య మమత వైద్య కళాశాలకు పార్థివదేహం

ఖమ్మం, నవంబర్ 29: (నేటినిజం ప్రతినిధి): కడవరకు కమ్యూనిస్టుగా నిలిచి ఎందరికో స్ఫూర్తినిచ్చి కమ్యూనిస్టు ఉద్యమ భవిష్యత్తుపై ఆశలు రేపిన సమరసేనాని పోటు ప్రసాద్ కు ఘనంగా నివాళులర్పించారు. ఆయనకు కడపటి వీడ్కోలు పలికేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి కమ్యూనిస్టు శ్రేణులు,

వామపక్ష అభిమానులు, వివిధ రాజకీయ పక్షాల నేతలు కదిలొచ్చారు. అమర్ హై పోటు ప్రసాద్ నినాదాలతో ఆ ప్రాంతం మారుమ్రోగింది, అంతిమ యాత్రలో పాల్గొన్న ప్రతి హృదయం బరువెక్కింది. పోటు ప్రసాద్ తమకున్న అనుబంధాన్ని లోలోపలే గుర్తు చేసుకుంటూ కళ్లు చెమరుస్తుంటే అరుణ పతాకం చేబూని అడుగులేశారు. బుధవారం మరణించిన సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అంతిమ యాత్ర శుక్రవారం ఖమ్మం సిపిఐ కార్యాల యం గిరిప్రసాద్ భవన్ నుంచి ప్రారంభమైంది. ప్రజల సందర్శనార్థం పార్థివ దేహాన్ని పార్టీ కార్యాలయానికి తరలించిన నేతలు సంతాప సభ అనంతరం ర్యాలీ ప్రారంభమైంది. పోటు ప్రసాద్ 64సంవత్సరాల వయస్సుకు సంకేతంగా 64అరుణపతాకాలను చేబూనిన యువదళం ముందు నడవగా ఆ తర్వాత డప్పు దళం, పార్టీ నాయకత్వం, కుటుంబ సభ్యులు ర్యాలీగా కదిలారు. బైపాస్ రోడ్డు, ఆర్టివో కార్యాలయం, గట్టయ్య సెంటర్, ఇల్లందు క్రాస్ రోడ్డు, ఐటి హబ్ సెంటర్, మమత రోడ్డు మీదుగా ర్యాలీ మమత మెడికల్ కళాశాలకు చేరుకుంది. దారి పొడవునా జనం ప్రసాద్ కు నివాళులర్పించారు. సమకాలిన రాజకీయాలలో తనకంటూ ఒక ప్రత్యేకతను చాటి ఖమ్మంజిల్లా రాజకీయాలలోనూ ముఖ్యంగా కమ్యూని స్టు పార్టీ యవనికపైన తనదైన ముద్రవేసిన పోటు ప్రసాద్ కు ఘనమైన వీడ్కోలు లభించింది. ఇటీవల కాలంలో ఏ రాజకీయ నేత మరణానికి జనం ఇంతగా స్పందించలేదంటే అతిశయోక్తి కాదు. విద్యార్థి ఉద్యమం నుంచి ఎర్రజెండాతో పెనవేసుకున్న ఆయన బంధం, త్యాగాలకు చిరునామాగా మారిన ఆయన కుటుంబం వెరసి ప్రసాద్ ఉద్యమ పదంలో ఒక వేగు చుక్కలా నిలిపింది. బరువెక్కిన హృదయాలు అమర్ హై నినాదాలతో ముందుకు సాగాయి. ప్రసాద్ కోరిక మేరకు కుటుంబ సభ్యులు 1/2ఆయన పార్థివ దేహాన్ని మమత మెడికల్ కళాశాలకు అప్పగించారు. మమత వైద్య విద్యా సంస్థల కార్యదర్శి పువ్వాడ జయశ్రీ, కుటుంబ సభ్యుల నుంచి అశ్రునయనాల మధ్య స్వాధీనపర్చుకున్నారు. మమత సంస్థలకు అంకురార్పణ చేసిన వారిలో పోటు ప్రసాద్ ఒకరని పోటు ప్రసాద్, పువ్వాడ ఉదయ్ కుమార్ బంధాన్ని జయశ్రీ గుర్తు చేసుకున్నారు. ఉదయ్, ప్రసాద్ అనుబంధాలకు గుర్తుగా ఉదయ్ చిత్ర పటం సాక్షిగా ప్రసాద్ పార్థివ దేహాన్ని వైద్య విద్యార్థుల పరీక్షల కొరకు అప్పగించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా, పోటు ప్రసాద్ కు అత్యంత ఆప్తులుగా ఉన్న దండి సురేష్, మహ్మద్ మౌలానా, బి.అయోధ్య, జమ్ముల జితేందర్రెడ్డి, ఎస్కె జానిమియా, గోవిందరావు, పలువురు యువనేతలు ఆయన పార్థివ దేహాన్ని మోశారు. ఈ అంతిమ యాత్రలో కుటుంబ సభ్యులతో పాటు పెద్ద సంఖ్యలో కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. ర్యాలీ అగ్రభాగాన సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్. బాలమల్లేష్, ప్రజా సంఘాల బాధ్యులు, వివిధ జిల్లాల సిపిఐ కార్యదర్శులు, కుమారుడు సాత్విక్, తల్లి సక్కుబాయి, సతీమణి నిర్మల, సోదరి, సోదరులు తదితరులున్నారు.

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాకేష్ కు సన్మానం

-సన్మానించిన కరీంనగర్ జిల్లా మేదరి సంఘం నాయకులు
-మేదరి సంఘాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన నాయకులు

కరీంనగర్, నవంబర్ 29: (నేటినిజం ప్రతినిధి) వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన పట్టణానికి చెందిన కనికరపు రాకేష్ ను వారి నివాసంలో శుక్రవారం కరీంనగర్ జిల్లా మేదరి సంఘం నాయకులు పుష్పగుచ్చం అందించి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా మేదరి సంఘం అధ్యక్షులు మధిర రవీందర్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా మేదరి కులాన్ని పాలకులు గుర్తించలేదని, గత ప్రభుత్వాలు సంచార జాతులుగా గుర్తించబడ్డ మేదరి కులాన్ని పట్టించుకోకపోవడం, రాజకీయంగా ఎదగడానికి అవకాశం కల్పించక పోవడం చాలా బాధాకరమని, ప్రజా పాలన అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం మేదరి ముద్దుబిడ్డ రాకేష్ ను వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గా నియమించడం సంతోషకరమైన విషయమని, మేదరి కులాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వానికి, స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అలిపి రెడ్డి లచ్చయ్య మాట్లాడుతూ వెనుకబడిపోయిన మేదరి కులాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించడంతోపాటు, మేధావులను అన్ని రంగాల్లో ఆదుకోవాలని, వేములవాడ పట్టణంలో మేదరి కులానికి సంబంధించిన ట్రస్ట్ ఏర్పాటుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహాయ సహకారాలు అందించాలని, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎప్పటికీ రుణపడి ఉంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అధ్యక్షులు మధిర రవీందర్, జిల్లా గౌరవ అధ్యక్షులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏకుల రాజన్న, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అలిపిరెడ్డి లచ్చయ్య, కరీంనగర్ నగర అధ్యక్షులు ఏకుల రమేష్, రాష్ట్ర సహాయ కార్యదర్శి సిలువేరి సత్యనారాయణ, కొత్తపల్లి మండల అధ్యక్షులు మదిరె గంగాధర్, జిల్లా కోశాధికారి పర్ల రాజు, జిల్లా ప్రచార కార్యదర్శి మొలుగూరి కుమారస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు సూరినీడ బాలయ్య, పట్టణ గౌరవ అధ్యక్షులు పిట్టల కనకయ్య, పట్టణ కోశాధికారి ఎనగందుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రంపై శ్రీ చైతన్య విద్యార్థులకు అవగాహన

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 29: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్ శుక్రవారం విద్యార్థిని, విద్యార్థులు 6వ తరగతి నుండి 9వ తరగతి పిల్లలు పట్టణంలోని అగ్నిమాపక సిబ్బంది. మంలోవేములవాడ అగ్నిమాపక అధికారి అనిల్, ఏఈఎం ముద్ర కోల వివత్తులు సంభవించినప్పుడు అగ్నిమాపక దళం ఏ విధంగా కృషి చేస్తుందో, అలాగే తమకు తాము కాపాడుకోవడానికి విధానాలను అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలోవేములవాడ అగ్నిమాపక అధికారి అనిల్, ఏఈఎం ముద్ర కోల రాజు , ప్రిన్సిపల్ సుదీష్ కుమారి, డీన్ అంజయ్య, ప్రైమరీ ఇంచార్జ్ రజిత, ప్రవళిక, ఏవో సుదీర్, పి ఈటిలు సుధాకర్, మారుతి, అగ్నిమాపక సిబ్బంది,, అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక దళం వారు రోడ్డు ప్రమాదాలు, నీటి ప్రమాదాలు, వరదలు సంభవించినప్పుడు, ఇతర

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.